

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

## సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోవిడ్ కేర్ సెంటర్ ప్రారంభం

విజయవాడసుజనా ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో వెన్యూ కన్వెన్షన్ లో 100 పడకల కోవిడ్ కేర్ సెంటర్ ను కృష్ణాజిల్లా కలెక్టర్ ఇంతియాజ్ శనివారం ప్రారంభించారు. కలెక్టర్ ఇంతియాజ్ మాట్లాడుతూ జీజీహెచ్ అనుబంధంగా ఈ కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసాం. ప్రభుత్వాసుపత్రి కి అనుబంధంగా 100 పడకలతో కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటుకు సహకరించిన సుజనా ఫౌండేషన్ కు ధన్యవాదాలు. ఇక్కడ 24/7 ఆక్సిజన్ తోపాటు వైద్యులు అందుబాటులో ఉంటారు. 100 పడకల కోవిడ్ కేర్ సెంటర్ ప్రారంభంతో కొంతమేర ప్రభుత్వాస్పత్రిపై భారం తగ్గుతుంది. ప్రభుత్వ వైద్యులతోపాటు కొంతమంది ప్రైవేట్ వైద్య సిబ్బంది కూడా ఇక్కడ వైద్య సేవలందించేలా ఏర్పాట్లు చేశాం.. ఇటువంటి సేవలు చేసేందుకు ముందుకు వస్తే వారికి సహకరిస్తామని అన్నారు.

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 16 మే 2021 సంపుటి : 02 సంచిక :304 పేజీలు : 4 వెల : రూ 3-00

# మృతుల గౌరవాన్ని కాపాడేలా చట్టం తేవాలి : ఎన్‌హెచ్‌ఆర్‌సీ




న్యూఢిల్లీ : దేశాన్ని కరోనా వణికిస్తోంది. పెద్ద సంఖ్యలో జనం మహమ్మారితో మృత్యువాతపడుతున్నారు. ఈ సమయంలో వారి మృతదేహాలను తీసుకునేందుకు బంధువులు ముందుకు రావడం లేదు. ఈ క్రమంలో మృతులకు అంతిమ సంస్కారాల నిర్వహణ విషయంలో అవమానకరమైన ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) కేంద్రం, రాష్ట్రాలకు కీలక సూచనలు చేసింది. మరణించిన వారి గౌరవ ప్రతిష్ఠలు కాపాడేలా కొత్త చట్టం తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఈ మేరకు పలు ప్రతిపాదనలు చేసిన జాతీయ మానవ హక్కుల సంఘం సామూహికంగా అంత్యక్రియలు జరగకుండా చూడాలని పేర్కొంది. సామూహిక ఖననాలు.. మరణించిన వారి గౌరవాన్ని దిగజార్చుతాయని అభిప్రాయపడింది. ఇటీవల బిహార్, ఉత్తరప్రదేశ్‌లో గంగానదిలో కొవిడ్ రోగుల మృతదేహాలు తేలిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మానవ హక్కుల సంఘం కేంద్ర హోం వ్యవహారాలు, ఆరోగ్య కుటుంబ మంత్రిత్వశాఖల కార్యదర్శులు, రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు ఎన్‌హెచ్ ఆర్‌సీ లేఖ రాసింది. ఈ విషయంలో కేంద్రం, ఆయా రాష్ట్రాలకు సైతం నోటీసులు జారీ చేసింది. అలాగే బిల్లులు చెల్లించలేదని మృతదేహాలను ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యాలు అట్టిపెట్టుకోకుండా చూడాలని, గుర్తు తెలియని మృతదేహాలను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించింది. గుర్తు తెలియని, చనిపోయిన వారి గురించి రాష్ట్ర అధికారులు తప్పక సమాచారాన్ని నిర్వహిం చాలని పేర్కొంది. అలాగే అంత్యక్రియలు నిర్వహించే సిబ్బందికి అవసరమైన భద్రతా పరికరాలు, సౌకర్యాలు కల్పించాలని, అప్పుడే తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలరని తెలిపింది. మతపరమైన ఆచారాలు పాటించేందుకు అనుమతి ఇవ్వాలని, కొవిడ్ మృతులకు చివరి ఖర్మలు చేయలేని స్థితిలో ఉన్నా, ముందుకు వారికి స్థానిక పరిపాలన సాంస్కృతిక అంశాలను పరిగణలోకి తీసుకొని అంత్యక్రియలు పూర్తి చేయాలని సూచించింది. ఇదిలా ఉండగా.. కరోనా మహమ్మారి మహమ్మారి కారణంగా మే 13 నాటికి దేశంలో 2.62 లక్షలకుపైగా మరణించారు. కేంద్రం, రాష్ట్రాలు మరణాలకు సంబంధించి జిల్లా వారీగా డిజిటల్ డేటాను నిర్వహించాలని కోరింది. దీని కోసం డైనమిక్ వెబ్ పోర్టల్‌ను రూపొందించాలని.. కొవిడ్, నాన్ కొవిడ్ మరణాల డిజిటల్ నిర్ధారణ ఒకే సారి బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డ్, బీమా మొదలైన అన్ని పత్రాలను నవీకరించాలని సూచించింది.

# కరోనా, టీకా డ్రైవ్‌పై ప్రధాని ఉన్నత స్థాయి సమీక్ష




న్యూఢిల్లీ : దేశంలో కరోనా పరిస్థితి, టీకా డ్రైవ్ ప్రధాని నరేంద్ర మోదీ సమీక్ష జరిపారు. దేశంలో కరోనా ఉధృతి కొనసాగుతున్న వేళ తాజా పరిస్థితులు, వ్యాక్సిన్ పంపిణీపై ప్రధానమంత్రి ఉన్నతస్థాయి అధికారులతో వర్చువల్ విధానంలో చర్చలు జరిపారు. సమావేశానికి పీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఆరోగ్యమంత్రిత్వశాఖ సెక్రెటరీ తదితరులు హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. గత 24 గంటల్లో కొత్తగా 3,26,098 కేసులు నమోదయ్యాయి. మరో 3,890 మంది మృతిచెందారు. దీంతో మొత్తం కేసుల సంఖ్య 2,43,72,907కు చేరింది. ఇందులో 2,04,32,898 మంది బాధితులు కోలుకోగా, 36,73,802 కేసులు యాక్టివ్ కేసులున్నాయని, వైరస్ బారినపడి మొత్తం 2,66,207 ప్రాణాలు కోల్పోయారని ఆరోగ్యశాఖ తెలిపింది. మరో వైపు అలాగే తౌక్టే తుఫాను నేపథ్యంలో చేపట్టిన చర్యలపై సైతం సాయంత్రం 5 గంటలకు ప్రధాని సమీక్ష నిర్వహించనున్నారు. తుఫాను హెచ్చరికలు, ముందస్తు చర్యలపై అధికారులతో మాట్లాడనున్నారు. తౌక్టే తుఫాను అమినీ దీవికి ఈశాన్య దిశగా 160 కిలోమీటర్ల దూరంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరింత బలపడి తీవ్ర తుఫానుగా మారుతుందని, ఉత్తర వాయువ్య దిశగా ప్రయాణించి మరింత బలపడుతుందని పేర్కొంది. తదుపరి 12 గంటల్లో మరింత బలపడి అతితీవ్ర తుఫానుగా మారుతుందని, ఈ నెల 18న గుజరాత్ వద్ద రాత్రి 8.30గంటల మధ్య పోరుబందర్ - నలియా మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. ఈ సమయంలో 150-175 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని అవకాశం ఉందని వివరించింది.

# రఘురామకృష్ణరాజుకు ఏపీ హైకోర్టులో చుక్కెదురు



అమరావతి : ఎంపీ రఘురామకృష్ణరాజుకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. రఘురామ అరెస్ట్ విషయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. బెయిల్ కావాలంటే కింది కోర్టును ఆశ్రయించాలని తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ కేసులో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. కాగా, పథకం ప్రకారం ప్రభుత్వాన్ని, ప్రభుత్వ పదవుల్లో ఉన్న వారిని కించపరిచే చర్యలకు పాల్పడుతూ సామాజిక వర్గాల మధ్య ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్న నరసాపురం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణరాజును ఏపీ సీఐడీ శుక్రవారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆయనపై ఎఫ్ఐఆర్ 12/2021 నమోదు చేశారు. ఏ1గా రఘురామకృష్ణరాజు, ఏ2గా టీవీ5, ఏ3గా ఏబీఎన్ ఛానల్‌ను సీఐడీ ఎఫ్ఐర్‌లో పేర్కొంది. సీఐడీ డీఐజీ ఎంక్వైరీ రిపోర్టు ఆధారంగా ఈ కేసు నమోదు చేశారు. రఘురామపై అభియోగాలను సీఐడీ ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచింది. అదేవిధంగా ప్రభుత్వంపై విద్వేషాలను రెచ్చగొట్టేలా రఘురామ వ్యాఖ్యలు చేసినట్లు పేర్కొంది.


# ఇంటింటా ఫీవర్ సర్వే




అమరావతి: మహమ్మారి కరోనా వైరస్ వ్యాప్తి కట్టడికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. ఓవైపు.. కర్ఫ్యూ అమలు చేస్తూనే, అవసరాలకు సరిపడా వ్యాక్సిన్లు సకాలంలో దేశీయంగా లభించనందున వ్యాక్సిన్ల కొనుగోలు కోసం గ్లోబల్ టెండర్లు నిర్వహించాలని నిర్ణయించింది. తద్వారా వ్యాక్సినేషన్ ప్రక్రియకు వేగవంతం చేసేలా అడుగులు వేస్తోంది. అదే విధంగా.. రాష్ట్రంలో ఆక్సిజన్ కొరత లేకుండా చూసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయాలను అన్వేషించి ఆక్సిజన్ నిల్వలను పెంచేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అదనపు ఆక్సిజన్‌ను జిల్లాల్లో అత్యవసరాల కోసం నిల్వ చేస్తామని వైద్య ఆరోగ్య ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఇప్పటికే వెల్లడించారు. ఇక పెద్ద ఎత్తున కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తోన్న ప్రభుత్వం.. శనివారం నుంచి జ్వరాలపై ఇంటింటి సర్వే ప్రారంభించింది. ఇప్పటికే రాష్ట్ర అధికారులు, జిల్లా వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఇంటింటి సర్వేపై దిశా నిర్ధేశం చేశారు. సర్వేలో భాగంగా వలంటీర్లు, ఆశా కార్యకర్తలు కలిసి ఇంటింటికి తిరిగి జ్వరపీడితులను గుర్తిస్తారు. ఎవరికైనా కోవిడ్ లక్షణాలుంటే ఆ విషయాన్ని సంబంధిత ఏఎన్ఎంకు తెలియజేస్తారు. అంతేకాకుండా వివరాలను ఎప్పటికప్పుడు వలంటీర్ల యాప్‌లోనూ అప్‌లోడ్ చేస్తారు. కరోనా పాజిటివ్‌గా తేలిన వారిని అవసరాన్ని బట్టి కోవిడ్ కేర్ సెంటర్‌లో గానీ, ఆస్పత్రిలో గానీ చేర్పిస్తారు. కరోనా లక్షణాలేవీ లేని వారిని, ప్రైమరీ కాంటాక్ట్‌లో ఉన్న వారిని, కరోనా నుంచి పూర్తిగా కోలుకున్న వారిని 14 రోజుల వరకు హోం క్వారంటైన్‌లో ఉంచుతారు. వారికి అవసరమైన మందుల కిట్ ఇచ్చి ఏఎన్ఎం ద్వారా పర్యవేక్షణ చేయస్తారు. జర్వ పీడితులను గుర్తించి అక్కడికక్కడే మందులు, కరోనా కిట్లు అందజేయనున్నారు. దీనివల్ల కరోనాను కట్టడి చేయడమే కాక, ఆస్పత్రులపై ఒత్తిడి కూడా తగ్గనుంది.

# మాజీ గవర్నర్, కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్‌ఎల్ భాటియా కన్నుమూత

ఛండీఘడ్ : మాజీ గవర్నర్, పంజాబ్ కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్‌ఎల్. భాటియా (100) కన్నుమూశారు. వయోభారంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తీవ్ర అసౌకర్యానికి గురికావడంతో కుటుంబీకులు అమృత్‌సర్‌లోని ఫోర్టిస్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం భాటియా తుదిశ్వాస విడిచారు. అమృత్‌సర్ పార్లమెంట్ స్థానం నుంచి 1972 నుంచి ఇప్పటివరకు ఆయన ఆరుసార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. 2004 నుంచి 2008 వరకు ఆ తరువాత 2008 నుంచి 2009 వరకు కేరళ గవర్నర్‌గానూ ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. ఈ ఏడాది జూలై 3వ తేదీతో ఆయనకు 101 ఏండ్లు నిండనున్నాయి.



# రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి: అయ్యన్నపాత్రుడు

అమరావతి: రాష్ట్రంలో నెలకొన్న రాజ్యాంగ అస్థిరతపై రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. పోలీస్, సీఐడీ, ఏసీబీ వ్యవస్థలు ముఖ్యమంత్రి చేతిలో కీలుబొమ్మలుగా మారాయని.. న్యాయస్థానాలు, గవర్నర్ చెప్పినా ముఖ్యమంత్రి వినే స్థితిలో లేడని ఆయన అన్నారు. రాష్ట్రంలో పరిస్థితపై అయ్యన్నపాత్రుడు శనివారం మీడియాతో మాట్లాడుతూ “ముఖ్యమంత్రి కక్షసాధింపు చర్యలు, సైకోచేష్టలు, వ్యవస్థలను తనచేతిలో పెట్టుకొని ఆడిస్తున్న తీరుపై రాజ్యాంగానికి ప్రతినిధులుగా ఉన్నవారు స్పందించకపోతే ఎలా? లోక్ సభ స్పీకర్, కేంద్రహోం మంత్రి అనుమతి లేకుండానే ఎంపీని అరెస్ట్ చేయడం ఏంటి? ముఖ్యమంత్రి చర్యలు, ఏకపక్ష విధానాలు, ప్రజావ్యతిరేక నిర్ణయాలను ప్రశ్నించడం తప్పెలా అవుతుంది? రఘురామరాజు చేసింది తప్పయితే, జగన్మోహన్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి లు చేసింది అంతకంటే పెద్ద తప్పుకాదా? ప్రతిపక్షనేతగా ఉన్న జగన్ రెడ్డి, ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడిని ఉద్దేశించి ఎన్నెన్ని మాటలన్నాడో అందరికీ తెలుసు. చీపుర్లతో తరిమికొట్టాలని, రాళ్లతో కొట్టాలని, కాల్చిచంపాలని, బంగాళాఖాతంలో విసిరేయాలని, చంద్రబాబుకి అంతిమఘడియలు దాపురించాయని.. ఇలా చాలా అన్నారు.

# ప్రభుత్వం నిర్ణయంపై మంత్రి అంజాద్ బాషా హర్షం

## ఏపీ మత సామరస్యానికి ప్రతీక డిప్యూటీ సీఎం అంజాద్ బాషా



వైఎస్సార్ జిల్లా: అర్చకులు, ఇమామ్, మోజం, పాస్టర్ల గౌరవ వేతనం పెంపుపై డిప్యూటీ సీఎం అంజాద్ బాషా హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మన రాష్ట్రం మత సామరస్యానికి ప్రతీక అని తెలిపారు. వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమాజంలో అర్చకులు, పాస్టర్లు, మోజన్లు, ఇమామ్‌లకు గౌరవ స్థానం ఇవ్వాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా పాస్టర్లకు కూడా వేతనాలు పెంచారని ఆయన తెలిపారు.‘ ‘పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం వీరి సమస్యలను పట్టించుకోలేదు. కరోనా కష్ట కాలంలో కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్. ప్రణాళిక ప్రకారం పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం. కరోనా మహమ్మారిని నిరోధించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు భేష్. ఈ విషయంలో ఇతర రాష్ట్రాలు సైతం మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నాయనివవ మంత్రి తెలిపారు.

## దేశంలో కొత్తగా 3.26 లక్షల కరోనా కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసులు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. నిన్న 3.4 లక్షలకుపైగా కేసులు నమోదవగా, తాజాగా అవి 3.26 లక్షలకు తగ్గాయి. అయితే మృతులు మాత్రం పెరుగుతూనే ఉన్నారు. దేశవ్యాప్తంగా గత 24 గంటల్లో కొత్తగా 3,26,098 కేసులు నమోదయ్యాయి. మరో 3,890 మంది మృతిచెందారు. దీంతో మొత్తం కేసుల సంఖ్య 2,43,72,907కు చేరింది. ఇందులో 2,04,32,898 మంది బాధితులు కోలుకోగా, 36,73,802 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. మరో 2,66,207 మంది బాధితులు మృతిచెందారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: ఆళ్ల నాని

## కరోనా కట్టడి చర్యలు, వ్యాక్సినేషన్‌పై మంత్రి ఆళ్లనాని సమీక్ష

విశాఖపట్నం: కరోనా కట్టడి చర్యలు, వ్యాక్సినేషన్‌పై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల నాని శనివారం సమీక్ష నిర్వహించారు. కోవిడ్ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. చికిత్స విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఆక్సిజన్ సరఫరాను వేగవంతం చేశామని ఆయన పేర్కొన్నారు. రేపటి నుంచి ఏపీకి అదనంగా 230 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ రానుందని వెల్లడించారు. వ్యాక్సిన్ కేంద్రాల వద్ద రద్దీ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఆళ్లనాని తెలిపారు.



# భారత్‌కు 5 కోట్ల ఫైజర్ డోసులు!

ప్రస్తుతం కరోనాతో విలవిలలాడుతున్న భారత్‌కు త్వరలో 50 మిలియన్ల (5 కోట్ల) వ్యాక్సిన్ డోసులను పంపించబోతున్నట్టు అమెరికా ఫార్మా దిగ్గజం ఫైజర్ సంస్థ ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నాటికి పంపిస్తామని సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతున్నప్పటికీ.. టీకాల కొరత బాగా వేధిస్తోంది. ఈ నేపథ్యంలో ఇతర దేశాల వ్యాక్సిన్ల వాడకానికి కూడా భారత్ అనుమతి ఇచ్చింది. అమెరికాలో ఉత్పత్తి అవుతున్న ఫైజర్, మోడెర్నా టీకాలను ఎగుమతి చేసేందుకు అమెరికా ప్రభుత్వం అంగీకరించడం లేదు. ఈ నేపథ్యంలో ఐరోపా దేశాల్లో ఉత్పత్తి జరుగుతున్న కేంద్రాల నుంచి ఫైజర్ వ్యాక్సిన్లు భారత్‌కు రాబోతున్నాయి.

# సంపాదకీయం

ఆదివారం 16 మే 2021

## వృద్ధుల సంఖ్య పెరిగిపోవడంతో ఒకే సంతానం విధానానికి స్వస్తి పలికిన చైనా

ఏ విధానం ఎల్లకాలం సత్ఫలితాలను అందించదు. కొంతకాలం తరవాత పరిస్థితులు మారి ఆ విధానం ప్రతికూల ఫలితాలను ఇస్తుంది. అందువల్ల కాలానుగుణంగా, పరిస్థితులకు అనుగుణంగా మారడమే వివేకం అనిపించుకుంటుంది. అలా కాకుండా మొండిగా ముందుకెళ్లినట్లయితే దుష్ఫలితాలను చవిచూడాల్సి వస్తుంది. ఇది వ్యక్తులకు, వ్యవస్థలకు, సంస్థలకు, దేశాలకూ వర్తిస్తుంది. అగ్రరాజ్య హోదా కోసం పరితపిస్తున్న, అమెరికాను అనేక విషయాల్లో సవాల్ చేస్తున్న ఆసియా అగ్రరాజ్యం డ్రాగన్ దేశమైన చైనా ఇప్పుడు తన విధానాన్ని మార్చుకునేందుకు కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా జనాభా కు సంబంధించి మొండిగా ముందుకెళితే ఎదురుదెబ్బలు తప్పవని గ్రహిస్తోంది. చైనా కొత్తగా అనసరించబోయే నూతన జనాభా విధానం వల్ల ఇప్పటికే 144, 38, 82,127 జనాభా మున్ముందు మరింత పెరగనుంది. అయినప్పటికీ ఆ దిశగానే సాగేందుకు నిర్ణయించింది. జనాభా పెరుగుదలపై ఇప్పటివరకు గల ఆంక్షలను సడలించాలని దేశ సెంట్రల్ బ్యాంకు (మన రిజర్వు బ్యాంకు వంటిది) అయిన పీపుల్స్ బ్యాంకు ఆఫ్ చైనా (పీబీఓసీ) విధాన పత్రం సూచించింది. మార్చి 26న 22 పేజీల ఈ విధాపత్రాన్ని రూపొందించింది. ఇటీవల ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం దేశంలో ఒకే సంతానం అన్ననిబంధన అమల్లో ఉంది. జనాభా పెరుగుదలను నియంత్రించేందుకు 1979లో ఒక జంటకు ఒక సంతానం అన్న సూత్రాన్ని అమలు చేసింది. ప్రస్తుతం దేశంలో సంతానోత్పత్తి రేటు 1.5 శాతంగా ఉంది. 2019లో జననరేటు ప్రతి వెయ్యిమందిలో 10.489 శాతానికి పడిపోవడం గమనార్హం. తాజాగా దంపతులు ఇద్దరు లేదా ముగ్గురు పిల్లల్ని కనేందుకు అనుమతించాలని సూచించింది. ఒకే సంతానం విధానం వల్ల దేశంలోవయోధికుల జనాభా పెరిగింది. వారి బాగోగులు చూసే వార కరవయ్యారు. ఉన్న ఒక్క సంతానం ఉత్పత్తి పనుల్లో నిమగ్నం కావడం వల్ల పెద్దల సంక్షేమాన్ని చూసే వారు లేకుండాపోయారు. ఇది ఒక కోణం.మరో కోణంలో చూసినప్పుడు ఈ సమస్య దేశ ప్రగతిని దెబ్బ తీస్తుందని, ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందని పీపుల్స్ బ్యాంకు ఆఫ్ చైనా విధాన పత్రం ఆందోళన వ్యక్తం చేసింది. సంతానోత్పత్తిపై నియంత్రణ కొనసాగిస్తే 2050 నాటికి చైనా జనాభా2 శాతం తగ్గుతుందని ఈ విదాన పత్రం నిర్దిష్టంగా అంచనా వేసింది. జనాభాపై నియంత్రణను కొనసాగించినందున 1979 నుంచి దాదాపు 400 మిలియన్ల జననాలను అడ్డుకున్నట్లు స్పష్టం చేసింది. పొరుగున ఉన్న భారత్ లో సంతానోత్పత్తిపై ప్రభుత్వపరంగా కఠినమైన నియంత్రణలు లేవు. దీంతో యువకుల జనాభా ఎక్కువగా ఉంది. వీరు తమకున్నంతలో పెద్దల బాగోగులను చూసుకుంటున్నారు. దీనివల్ల వయోధికులకు సాంత్వన కలుగుతుంది. అదే సమయంలో యువకులు పెద్దయెత్తున ఉత్పత్తి కార్యకలాపాల్లో భాగస్వాములు అవుతున్నారు. ఇది పరోక్షంగా దేశ ప్రగతికి దోహద పడుతోందిపెరుగుతున్న యువకుల జనాభా దేశానికి అతి పెద్ద వనరుగా మారింది. అగ్రరాజ్యమైన అమెరికాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. 2019లో అమెరికా కంటే చైనా శ్రామిక శక్తి 5.4 శాతం తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో 2035, 2050 నాటికి ప్రకటిత లక్ష్యాల సాధనకు, అమెరికా, భారత్ తో పోటీపడటం కష్టమవుతుందని పీబీఓసీ విధాన పత్రం అంచనా వేసింది. తొలి రోజుల్లో చైనా కన్నా భారత ప్రగతిరేటు పరిమితంగా ఉండేది. ఇటీ వల కాలంలో చైనాతో భారత్ పోటీపడుతోంది. ఈ పరిస్థితుల్లో భారత్, అమెరికాల నుంచి ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు తన విధానాన్ని మార్చుకునేందకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా సంతానోత్పత్తిపై నియంత్రణ తొలగించే దిశగా బీజింగ్ కసరత్తు చేస్తోంది.

# విశాఖ చుట్టూ ప్రమాదాలు



విశాఖపట్టణం, మే 15, (న్యూస్ పల్స్)విశాఖను అయిదోతనం లేని నగరంగా అందుకే అంటారేమో. అన్నీ ఉన్నా కూడా ఏమీ కాకుండా ఒక మూలన పడిఉంది. బ్రిటిష్ పాలకులు గుర్తించి పెంచి పెద్ద చేసిన నగరం స్వదేశీ పాలకుల చేతిలో మాత్రం విసిరేసినట్లుగా ఎక్కడో ఉండిపోయింది. రాజసం మెరుపులు తప్ప అసలైన వైభోగం మాత్రం ఈ నగరానికి ఇప్పటికీ దక్కలేదు. దానికి కారణం విశాఖ సిటీ భౌగోళిక పరిస్థితులేనని అంటారు. ఇక వాస్తు కూడా విశాఖకు అచ్చిరాలేదని, లేకపోతే ఏనాడో విశాఖ హైదరాబాద్ కి ధీటుగా మారేదని కూడా చెబుతారు. ఏది ఏమైనా కూడా చేతిలో ముద్ద నోట్లోకి చేరకుండానే పెను ఉపద్రవాలు వచ్చి విశాఖను అతలాకుతలం చేస్తున్నాయి.విశాఖ భద్రత ఇపుడు మరో మారు చర్చకు వస్తోంది. నిజానికి విశాఖ భద్రత అన్నది 2014లో బాహాటంగా అతి ముఖ్యమైన చర్చగా వచ్చింది. ఆనాడు హుదూద్ తుఫాన్ విశాఖను వణికించేసింది. దాంతో ఈ ప్రాంతంలో ప్రజలు అల్లడిపోయారు. ప్రతీ వందేళ్ళకు వచ్చే అతి భయంకరమైన ప్రకృతి విపత్తు విశాఖను అలా కుదేల్ చేసింది. దాంతో అంతవరకూ విశాఖ మీద కొద్దో గొప్పో ఆశలు ఉన్న వారు సైతం ఈ నగరం ప్రకృతి ప్రకోపానికి బలి అయ్యే స్థితిలో ఉందని తేల్చేశారు. ఎపుడు ఏమి ముంచుకువస్తుందో తెలియదు అని కూడా అనేశారు. సముద్రాన్ని తాకుతూ విస్తరించిన ఈ నగరంలో భద్రతకు అవకాశాలు తక్కువేనని కూడా విశ్లేషించారు.ఇక విశాఖ చుట్టుపక్కలంతా పలు రసాయన పరిశ్రమలు ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ కూడా జనవాసాలను ఆనుకుని ఉన్నాయి. ఒక చిన్న తప్పిదం జరిగితే నగరం మొత్తం భస్మీపటలం అవడానికి ఎంతో సేపు పట్టదని నిపుణులు అంచనాలు ఉన్నాయి. విశాఖకు తూర్పు వైపు సాగరం ఉంది. కొండలు పడమర వైపు ఉన్నాయి. ఇక పరిశ్రమలు కూడా అటువైపు ఉన్నాయి. వాటి నుంచి వచ్చే కాలుష్యం కానీ విషపు వాయువులు కానీ సిటీని దాటి పోనీయని భౌగోళిక పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు. దీని వల్ల విశాఖలో ఏదైనా పెను ముప్పు వస్తే గాలిలోనే విష వాయువులు సుదీర్ఘమైన కాలం నిలిచి ఉంటాయని, అవే భారీ ప్రమాదానికి, ప్రాణనష్టానికి కారణం అవుతాయని చెబుతున్నారు. తాజాగా జరిగిన ఎల్జీ పాలిమార్స్ గ్యాస్ లీక్ ఓ మాదిరి ప్రమాదంగా చెబుతున్నారు. ఇంతకు మించి జరిగితే మొత్తం 14 నుంచి 20 కిలోమీటర్ల లోపునే విస్తరించి ఉన్న సిటీ మొత్తం ఆహుతి కావడానికి అట్టే సమయం పట్టదని కూడా ఆయా రంగాల్లోని నిష్ణాతులు విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో చూసుకుంటే విశాఖకు రాజధాని వస్తుందా అన్న ప్రశ్న మళ్ళీ ఏర్పడింది. విశాఖను రాజధాని చేస్తామని జగన్ గట్టి పట్టుదలగా ఉన్నారు. దాన్ని వ్యతిరేకిస్తున్న వారు హుదూద్ తుఫాన్లను ఇప్పటిదాకా గుర్తు చేసేవారు, ఇపుడు గ్యాస్ లీక్ ఘటనలతో అసలు భద్రతే లేదని అంటున్నారు. మరి దీని మీద వైసీపీ సర్కార్ ఏం చేస్తుందన్నది ఆలోచించాలి. విశాఖ రాజధాని వద్దు అంటున్న టీడీపీకి ఇతర పక్షాలకు ఈ పరిణామాలు కలసివచ్చేలా ఉన్నాయి. మరి ఈ వత్తిడి పెరిగితే వైసీపీ సర్కార్ ఏం చేస్తుంది అన్నది చూడాలి.తాజా పరిణామాలు చూసుకున్నపుడు విశాఖ ఇమేజ్ మొత్తం డ్యామేజ్ అయిందని అంటున్నారు. దీనికి ప్రకృతిపరమైన అవరోధాలను పక్కన పెడితే పాలకులు చేసిన తప్పుల కారణంగానే విశాఖ ఇమేజ్ డ్యామేజ్ అయిందని అంటున్నారు. ప్రమాదకరమైన పరిశ్రమలను నగరానికి దూరంగా ఒక ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేసుకుంటే విశాఖకు ఉపాధికి కొదవ ఉండదు, అభివృద్ధికి ఆటంకం ఉండదు అని అంటున్నారు. అదే సమయంలో విశాఖలో ప్రమాదాలు కూడా జరగవు అంటున్నారు. ఇక హుదూద్ తుఫాన్లు వంటివి ఎపుడో వస్తాయని, వాటికి తగిన యాక్షన్ ప్లాన్ తో సిద్ధం గా ఉంటే విశాఖ ప్రగతిని ఎవరూ ఆపలేరని మరో వైపు వినిపిస్తున్న సూచనలు. ఏది ఏమైనా విశాఖ విధి వంచితగా మిగులుతుందో, విధిని ధిక్కరించి వికసించి ముందుకు సాగుతుందో చూడాలి.

# మరింత మంది దాతలు ముందుకు రావాలి

**- వ్యాపార, వాణిజ్య సంస్థలకు మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పిలుపు**

కాకినాడ కోవిడ్ రెండోదశ ఉధృతి నేపథ్యంలో ప్రజలకు ఆపన్నహస్తం అందించడం సామాజిక బాధ్యతగా భావించి జిల్లాలోని పలు వ్యాపార, వాణిజ్య సంస్థలు ముందుకొచ్చి జీజీహెచ్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో మరికొంతమంది దాతలు ముందుకొచ్చి కోవిడ్ నివారణ, నియంత్రణ చర్యలకు సహకరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపా లకృష్ణ పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కాకినాడ జీజీహెచ్లో దేవీ ఫిషరీస్ లిమిటెడ్ ప్రతినిధులు.. మంత్రి వేణుగోపాలకృష్ణ, కలెక్టర్ డి.మురళీధర్రెడ్డి, జేసీ (ఆర్) డా. జి.లక్ష్మీశ, జేసీ (డీ) కీర్తి చేకూరి తదితరుల చేతుల మీదుగా దాదాపు రూ.21 లక్షల విలువైన వైద్య సామాగ్రిని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఆర్.మహాలక్ష్మికి జేశారు. అదే విధంగా రిలయెన్స్ ఇండస్ట్రీస్ రూ.35 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పది కేఎల్ సామర్థ్యమున్న ఆక్సిజన్ ట్యాంక్ను, ఈఎన్టీ బ్లాక్ వద్ద ఆధునికీకరించిన ట్రయాజ్ సెంటర్లోని 24 పడకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం దేశమంతా కోవిడ్ భయాందోళనలతో ఉందని, ఇలాంటి పరిస్థితిలో గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా అత్యధిక జనాభా గల జిల్లాలో అధికార యంత్రాంగం పటిష్ట కార్యాచరణతో కోవిడ్ కట్టడికి, రోగులకు మెరుగైన వైద్య సహాయం అందించేందుకు కృషిచేస్తోందని పేర్కొన్నారు. 24 బీ 7 పనిచేస్తూ ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేలా వైద్య, ఆరోగ్య శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కృషిచేస్తున్నారన్నారు. జీజీహెచ్లో ఇప్పటికే 20 కేఎల్ స్టోరేజ్ సామర్థ్యమున్న ఆక్సిజన్ ట్యాంక్ ఉందని, ప్రస్తుతం మరో పది కేఎల్ సామర్థ్యమున్న ట్యాంక్ అందుబాటులోకి రావడం వల్ల ఆసుపత్రి మొత్తానికి ఆక్సిజన్ సరఫరాకు ఎలాంటి ఇబ్బంది ఉండదని వివరించారు. ఈ కొత్త ట్యాంకును యుద్ధప్రాతిపదికన పది రోజుల్లోనే ఏర్పాటుచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి సైతం జీజీహెచ్కు వైద్యం కోసం వస్తున్నారని, ఈ నేపథ్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)గా సంస్థలు ముందుకొచ్చి సహాయమందించాలని సూచించారు. ప్రజల్లో కోవిడ్ ఉన్న భయాందోళనలను తొలగించి, అవగాహన కల్పించి కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు సహకరించాలని మీడియాకు మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సూచించారు.

# 104 సేవల విస్తరణకు కృషి

**కలెక్టర్ డి.మురలీధర్ రెడ్డి**

కలెక్టర్ డి.మురళీధర్రెడ్డి మాట్లాడుతూ రెండోదశ ప్రారంభమైన తర్వాత అత్యధికంగా ప్రస్తుతం రోజుకు దాదాపు 3,500 పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయని, దాదాపు 30 వేల యాక్టివ్ కేసులు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న వనరులను అత్యంత సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరముందని, అవసరం మేరకు వివిధ ప్రాంతాల్లో కోవిడ్ చికిత్సకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఇటీవల రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించామని, సోమవారం నాటికి కనీసం 50 పడకలను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని కోవిడ్ ఆసుపత్రుల్లోనూ అనుభవమున్న జిల్లాస్థయి అధికారులతో ఇటీవల తనిఖీలు నిర్వహించడం జరిగిందని, ప్రధానంగా ఆరోగ్యశ్రీ ద్వారా 50 శాతం పడకలు, రెమ్డెసివిర్ సక్రమ వినియోగం, నాన్ ఆరోగ్యశ్రీ రోగుల నుంచి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఫీజుల వసూలు తదితర అంశాలను క్షుణ్నంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. 104 కాల్సెంటర్ సేవలకు సంబంధించి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో రోజుకు 1500 వరకు ఫోన్కాల్స్ వస్తున్నాయని, తాజాగా 104 సేవలను మరింత విస్తరించేందుకు వీలుగా మహిళా పోలీసులకు శిక్షణ ఇచ్చామన్నారు. పాజిటివ్ వచ్చిన ప్రతి రోగితో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా ఐసోలేషన్కిట్ అందించడం లేదా సీసీసీ, ఆసుపత్రి అడ్మిషన్ తదితర సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డివిజన్ స్థాయిలోనూ కాల్సెంటర్లను ఏర్పాటుచేసి, కోవిడ్ బాధితుల్లో మనోధైర్యం నింపి, వేగంగా కొలుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అత్యవసర వైద్య సేవలు కోసం వచ్చేవారికి పడకలు అందుబాటులో ఉండేలా ఎప్పటికప్పుడు రోగుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి, ఆరోగ్యం బాగున్నవారిని డిశ్చార్జ్ లేదా సీసీసీకి పంపించడం జరుగుతుందన్నారు. రోగుల బంధువులు కూడా ఈ విషయంలో సహకరించాలని కోరారు. ముంబయి కార్పొరేషన్లో కోవిడ్ కట్టడి, రోగులకు వైద్య, ఇతర సేవలు అందిస్తున్న తీరును అధ్యయనం చేశామని.. సాధ్యాసాధ్యాలను బట్టి జిల్లాలోనూ ముంబయి మోడల్ అమలుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు.

# ఎంపీ రఘురామకృష్ణంరాజు అరెస్ట్ అక్రమం

**క్షత్రియులపై వైసీపీ ప్రభుత్వం కక్ష సాదింపు చర్యలు ఆపాలి లేకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు**

**మంతెన సత్యనారాయణరాజు**

విజయవాడ ఎంపీ రఘురామకృష్ణంరాజు అరెస్ట్ వైసీపీ అరాచక పాలనకు నిదర్శనం. ప్రభుత్వ వైఫల్యాల్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం సిగ్గుచేటు ? క్షత్రియులపై వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని టీడీపీ శాసనమండలి సభ్యులు మంతెన సత్యనారాయణరాజు విమర్శించారు. , మొన్న అశోక్ గజపతిరాజు రాజుపై అక్రమ కేసు పెట్టారు, ఇవాళ రఘురామ కృష్ణంరాజుని అరెస్ట్ చేశారు? రేపు మరొకరిని అరెస్ట్ చేస్తారు. క్షత్రియులుసర్వశక్తివంతులు, సమస్త దుష్టత్వం నుండి రక్షించి పరిపాలించువాడు క్షత్రియుడు. సమాజ సేవ చేస్తూ.. రాష్ట్రాభివృద్ధికి పాటు పడేవాళ్లు. అలాంటి వారిపై కక్ష్య సాధింపు చర్యలు సరికాదు. క్షత్రియుల ఓర్పు, సహనాన్ని పరీక్షించొద్దు.రఘురామకృష్ణంరాజు పై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తి వేసి విడుదల చేయాలి, లేకపోతే తరవాత జరిగే పరిణమాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. జగన్ బెయిల్ రద్దు చేయాలని రఘురామ కృష్ణం రాజు వేసిన పిటిషన్ ఈ నెల 17 న విచా రణకు వస్తోంది. ఆ కేసులో లాయర్లు వాదించకుండా భయపెట్టేందుకు అరెస్ట్ చేశారని అన్నారు..కుల మతాల మధ్య విబేధాలు సృష్టించేలా వ్యాఖ్యలు చేశారని రఘురామకృష్ణం రాజుని అరెస్టు చేశారు. మరి రాజ్యాంగ బద్ధ పదవుల్లో ఉన్న ఎన్నికల కమిషనర్ రమేష్ కుమార్ ని, జడ్జిలను కులం పేరుతో దూషించిన ముఖ్యమంత్రి జగన్ పై, వైసీపీ మంత్రులపై ఎందుకు సీఐడీ కేసులు నమోదు చేయలేదని ప్రశ్నించారు.

## కోవిడ్ సెంటర్ పై ప్రశంసలు

విశాఖపట్నం కరోనా విలయతాండవంతో ఉక్కిరిబిక్కిరవుతున్న భాదితులకు భరోసా ఇచ్చే విదంగా విశాఖలో 300 పడకల కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటుపై రాజకీయ పక్షాల ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.ఆక్సిజన్ సమస్యకు తావు లేకుండా ఎంపి విజయసాయి రెడ్డి చొరవతో ఏర్పాటైన కోవిడ్ కేర్ సెంటర్ ... భాదితులకు అండగా నిలుస్తోంది.ఆర్ఎస్ఎస్,వివేకానంద మెడికల్ ట్రస్ట్ సంయుక్త ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కోవిడ్ కేర్ కేంద్రాన్ని బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు సందర్శించారు.అక్కడున్న వసతులపై ఆరా దీసిన ఆయన ... ఎంపి విజయసాయి రెడ్డి చేసిన కృషిని ప్రసంసించారు.విశాఖలో బెడ్లు అందుబాటులో లేని తరుణంలో 300 పడకలతో కెంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు.

## శ్రీశైలం ప్రాజెక్టు మునక పొలాలలో మట్టి తవ్వకాలు

**చోద్యం చూస్తున్న రెవిన్యూ అధికారులు**

నందికొట్కూరు. మే 15 మండల పరిధిలోని శాతనకోట గ్రామ సమీపంలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు మునక పొలాలలోనీ ప్రభుత్వ భూముల్లో కొందరు వ్యక్తులు నల్ల మట్టి మాఫియా కు తెరతీశారు. ఏలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నల్లమట్టి ని తోలుతున్న అడిగే నాథుడే లేదని చెప్పవచ్చు. నందికొట్కూరు మండలం శాతన కోట గ్రామ సమీపంలో ప్రభుత్వ భూముల్లో మట్టి దందా జరుగుతున్న సంబంధిత రెవిన్యూ అధికారులు పట్టీపట్టనట్లు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ భూములలో ఎటువంటి అనుమతులు తీసుకొకుండా ప్రభుత్వ భూముల్లో సుమారు ఆరు అడుగుల లోతు వరకు జేసిబి లతో సారవంతమైన మట్టి తవ్వకాలు చేపట్టి నల్లమట్టి ని కొల్లగొడుతున్నారు. ప్రతి రోజు సుమారు 15 ట్రాక్టరు ల ద్వారా నాలుగు రోజులు గా మట్టిని తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు .సంబంధిత అధికారులకు అక్రమార్కులు మామూలు ముట్టజెప్పి ఈ అక్రమ దందాకు తెరలేపినట్లు ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. సంబంధిత రెవిన్యూ అధికారులు అక్రమ మట్టి మాఫియాకు పచ్చజెండా ఊపినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు ప్రతిరోజు 150 నుంచి 200 ట్రిప్పులు దాక అక్రమంగా నల్ల మట్టి తోలుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ భూముల్లో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి దర్జాగా తోలుతున్న అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తైనా చూడడం లేదు . ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు జరపకూడదు, తొలకూడదు అన్న నిబంధనలు ఉన్నప్పటికీ మట్టి మాఫియా మాత్రం ప్రభుత్వ భూముల్లో యదేక్షంగా మట్టి తవ్వకాలు చేపట్టడం, సంబంధిత అధికారులు కు తెలిసిన చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఒక ట్రాక్టర్ మట్టిని రూ, 600 నుంచి రూ, 800 దాక రైతులకు విక్రయించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. మునక పొలాలలో తవ్వకాలను అరికట్టాల్సిన అధికారులే మట్టి తవ్వకాల అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

## అక్సిజన్ దిగుమతిపై జీఎస్టీ రద్దు చేయాలి

కడప దేశంలోని పౌరులందరికి కేంద్ర ప్రభుత్వమే ఉచిత వ్యాక్సిన్ ఇవ్వాలని, ఆక్సిజన్ దిగుమతి పై జి.ఎస్.టి రద్దు చేయాలని ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో కడప జిల్లా పోరుమామిళ్లలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి లు మాట్లాడుతూ దేశంలో కరోనా సెకండ్ వేవ్ లో చాలా వేగంగా వ్యాప్తి చెందుతున్న సమయంలో దేశ పౌరులందరికి కేంద్ర ప్రభుత్వమే ఉచిత వ్యాక్సిన్ అందించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే దేశంలో, రాష్ట్రంలో కోవిడ్ హాస్పిటల్స్ లో బెడ్స్, ఆక్సిజన్ అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆక్సిజన్ నిలువలు లేకపోవడంతో విదేశాలనుండి దిగుమతి చేసుకుంటున్నారని, అయితే ఆక్సిజన్ దిగుమతిపై ప్రభుత్వం 12% జి.ఎస్.టి వసూలు చేస్తుందని ఇది చాలా దారుణమని, ఒకవైపు కరోనా తో ప్రజలు అల్లాడిపోతుంటే వారికి అండగా ఉండాల్సిన ప్రభుత్వం జి.ఎస్.టి పేరుతో ఇంకా ఇబ్బంది పెడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రాలపై పక్షపాత వైఖరి సరికాదని, కరోనా పేషేంట్స్ అందరికి బెడ్, ఆక్సిజన్ అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి మండల కేంద్రం లో ఐసోలేషన్ సెంటర్ ఏర్పారుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే వ్యాక్సిన్, ఆక్సిజన్ దిగుమతి పై జి.ఎస్.టి వసూలు వంటి విషయాలపై ఎస్.ఎఫ్.ఐ సుప్రీం కోర్ట్ జోక్యం కోరుతూ పిటిషన్ వేసామని తెలిపారు.

## భారీ వర్షాలకు నేల పాలయిన మామిడి కాయలు

కడప కడప జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు మామిడి పంటపై తీవ్ర ప్రభావం చూపాయి.ఈదురు గాలుల ఉధృతికి కోతకు వచ్చిన మామిడి కాయలు నేల రాలి భారీ నష్టం జరిగింది. రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాల్లో.. ఈదురు గాలులతో కూడిన వర్షాల తాకిడికి కోతకు వచ్చిన మామిడి కాయలు నేల రాలి భారీ నష్టం జరిగింది.కొన్ని మామి డిచెట్లు కూకటివేళ్లతో సహా లేచి పోవడం.. తీరని నష్టాన్ని కలిగించింది. కర్ఫ్యూ ఆంక్షలతో ధరలు లేక, కాయలు కొనేందుకు వ్యాపారులు రాక.. చెట్లకే ఉండిపోయిన మామిడి కాయలన్నీ నేలరాలాయని రైతులు వాపోయారు. రాజంపేట, రైల్వే కోడూర్ ప్రాంతాల్లో... అరటి, బొప్పా యి తోటలు దెబ్బతి న్నాయి.దింతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## ముందస్తుగా షెడ్యూల్ ఇచ్చి పరీక్షలు నిర్వహిస్తాం

ఒంగోలు టెన్త్, ఇంటర్ ఎగ్జామ్స్ నిర్వహణకి ఏర్పాట్లు అన్నీ జరిగాయి. ఈనెలాఖరు వరకూ విద్యార్థులకు సెలవు ఇచ్చాం. జూన్ 1 నుండి ఉపాధ్యాయుల్ని స్కూల్స్ కి రమ్మని చెప్పామని విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ప్రభుత్వం ప్రతి విషయాన్ని నిశితంగా గమనిస్తోంది. ప్రతిపక్ష పార్టీలు కుట్రపూరితంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్ని భయాందోళకి గురి చేస్తున్నాయి. పరీక్షల నిర్వహణకి ఇంకా మూడు వారాల సమయం ఉంది. పదో తరగతిలో గ్రేడింగ్ లేకపోతే విద్యార్థులకు నష్టం వాటిల్లుతుంది. విద్యార్థుల భవిష్యత్ ని దృష్టిలో ఉంచుకుని పరీక్షలు నిర్వహిస్తాం. ఇతర రాష్ట్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. ముందస్తుగా షెడ్యూల్ ఇచ్చి పరీక్షలు నిర్వహిస్తామని అయన అన్నారు.

## చంద్ర బాబు డైరెక్షన్ లోనే రఘురామకృష్ణంరాజు

భీమవరం రఘురామకృష్ణం రాజును అరెస్టు చేసి ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుందని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. పిచ్చి కుక్కల రోజూ రచ్చబండలో మాట్లాడుతున్న వ్యక్తి కి తగిన శాస్తి జరిగింది. జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహనీయులు క్షత్రియులు. క్షత్రియ సామాజిక వర్గానికి అపకీర్తి తెచ్చిన వ్యక్తి రఘురామ కృష్ణంరాజు. కరోనా సమయంలో ప్రజల సమస్యలను కనీసం పట్టించుకోని బాధ్యత లేని వ్యక్తి ఎంపీ రఘురామకృష్ణంరాజు. చంద్ర బాబు డైరెక్షన్ లోనే రఘురామకృష్ణంరాజు, పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ఉన్నాయని అయన అన్నారు. రఘురామ రాజును అరెస్టు చేయడం ఆలస్యమైన ఇప్పటికైనా ఏపీ సీఐడీ సరైన చర్య తీసుకుంది.

# విశాఖలో 11 బీచ్ ల అభివృద్ధి

విశాఖపట్టణం, మే 15, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో పర్యాటక రంగం అభివృద్ధి దిశగా మరో అడుగుపడింది. సాగర తీర ప్రాంతం భీమిలి ? భోగాపురం మధ్య పర్యాటక అభివృద్ధి పై జగన్ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. 1021 కోట్ల రూపాయల వ్యయంతో బీచ్ కారిడార్ అభివృద్ధికి రంగం సిద్ధం చేస్తోంది. 'భారత్ మాల' ప్రాజెక్టు కింద జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ తో కలిసి బీచ్ రోడ్డు అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఫలితంగా 15, 852 ఎకరాలలో ప్రత్యేక అభివృద్ధి ప్రాంతం ఏర్పాటు చేయబోతోంది. ఇటీవలి కేబినెట్ సమావేశంలో తెలిపిన ఆమోదం మేరకు ఈ సాయంత్రం ఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఉత్తర్వులు జారీ చేశారు. ఇలాఉండగా, మే 4వ తేదీన రాష్ట్ర మంత్రి వర్గం విశాఖపట్నానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా భీమిలి నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు బీచ్ రోడ్ లో 19 కి.మీ. మేర ఆరు వరుసల రహదారిని నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన భూసేకరణ చేపట్టాల్సి ఉంది.అలాగే కైలాసగిరి నుంచి భోగాపురం వరకు 11 బీచ్‌లను అభివృద్ధి చేయాలని ఆదేశించింది. గతంలో వీఎంఆర్‌డీఏ కైలాసగిరిపైనే స్కై టవర్ నిర్మాణానికి ప్రతిపాదించింది. అది కమిషనర్ మారగానే మూలన పడింది. కాపులుప్పాడలో ప్రత్యేక రాష్ట్ర అతిథి గృహం నిర్మాణం బాధ్యతలు పర్యాటక శాఖకు అప్పగించాలని కూడా సదరు మంత్రివర్గం సమావేశంలో నిర్ణయించారు.

# మహిళలకు పెద్ద పీట

విజయవాడ, మే 15, (న్యూస్ పల్స్)ఎన్నికల్లో మహిళలకు ఉండే ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. పురుష ఓటర్ల కంటే కూడా మహిళల ఓటు బ్యాంకు రాష్ట్రంలో ఎక్కువగా ఉంది. అంతేకాదు.. రాష్ట్రంలో పురుష ఓటర్లకంటే.. ముందుగానే మహిళలు ఓటు వేసేందుకు లైన్‌లోకి వస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏ పార్టీ అయినా.. రాజకీయంగా మహిళలను టార్గెట్ చేసుకుంటాయి. ఇదే సూత్రాన్ని అమలు చేస్తున్న వైసీపీ అధినేత జగన్.. తన సర్కారు ఏర్పాటైన తర్వాత.. ఇప్పటి వరకు అనేక కార్యక్రమాలను మహిళలకు కేంద్రంగా మార్చారు. ఒక డిప్యూటీ సీఎం సహా.. హోం శాఖను కూడా మహిళకే ఇచ్చారు.ఇక, ఇటీవల ముగిసిన మునిసిపల్.. ఎన్నికల్లోనూ, కార్పొరేషన్ ఎన్నికల్లోనూ మహిళలకు అవకాశం కల్పించారు. దీంతో తనది మహిళా పక్షపాత ప్రభుత్వమని ఆయన పదే పదే చెప్పుకొంటున్నారు. విచిత్రం ఏంటంటే జనరల్ సీటుగా ఉన్న విజయవాడ మేయర్ పదవిలో బీసీ మహిళకు ఛాన్స్ ఇచ్చిన జగన్.. బీసీ జనరల్‌గా ఉన్న వైజాగ్ మేయర్‌ను బీసీ మహిళకు ఇచ్చారు. ఈ నిర్ణయాలు రాజకీయాల్లోనే పెద్ద సంచలనాలు అయ్యాయి. అదే సమయంలో మహిళల కోసం దిశ చట్టాన్ని తీసుకువచ్చారు. 45 ఏళ్లు దాటిన మహిళలకు పింఛన్లు ఇస్తున్నారు.ఇలా.. అనేక రూపాల్లో మహిళలకు జగన్ సర్కారు చేరువ అయిందనడంలో సందేహం లేదు. ఇక, తాజాగా ఇప్పుడు మహిళ లకు బ్యాంకు రుణాలకు సంబంధించిన వడ్డీని కూడా జమ చేశారు. అయితే.. ఇది పాతదే అయినప్పటికీ.. దీనిలో ఉన్న ప్రత్యేకత ఏంటంటే.. గత చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వకుండా వదిలేసిన డబ్బును కూడా ఇప్పుడు జగన్ జమ చేయడం. సో.. మొత్తంగా ఈ పరిణామాలను చూస్తున్న టీడీపీ నేతలు.. "అరరే మనం తప్పుచేశాం" అని నాలిక కొరుక్కుంటున్నారు. మహిళల కోసం.. చంద్రబాబు హయాంలో ప్రత్యేకం రూపొందించిన పథకాలు లేవు. అదే విధంగా మంత్రి వర్గంలోనూ ముగ్గురికి అవకాశం ఇచ్చినా.. ప్రాధాన్యం లేని శాఖలు ఇచ్చారనే ప్రచారం జరిగింది.ఇక, ఎన్నికల సమయంలో పసుపు-కుంకుమ వంటివి ఇచ్చినా.. వాటిని కొందరికే పరిమితం చేయడం.. సమాజంలోని అన్ని వర్గాలకు చేరువ చేయకపోవడం.. పైగా.. ఇచ్చిన పది వేల రూపాయలను కూడా ఒకే సారి ఇవ్వకుండా విడతల వారీగా .. ఇవ్వడం వంటివి మహిళా ఓటు బ్యాంకుకు తీవ్ర విఘాతం కలిగించాయి. ఈ నేపథ్యంలోనే మహిళా ఓటు బ్యాంకు టీడీపీ వైపు నిలబడలేక పోయిందని అంటున్నారు పరిశీలకులు ఇదే విషయంలో జగన్ వ్యూహాత్మకంగా వేస్తున్న అడుగులు ఫలిస్తున్నాయని చెబుతున్నారు.

# ప్లీనరీలు..మహానాడులు ఎక్కడ

గుంటూరు, మే 15, (న్యూస్ పల్స్)పార్టీల అధినేతలకు కార్యకర్తలకు మధ్య బంధం బహు గట్టిది. పార్టీకి వారే వారధులు. అటువంటి కార్యకర్తలకు పార్టీ వార్షికోత్సవాలు అంటేనే పెద్ద పండుగలా ఉంటుంది. ఎందుకంటే అపుడు అధినేతతో సన్నిహితంగా మెలిగే చాన్స్ లభిస్తుంది కాబట్టి. ఇక పార్టీ అధినాయకత్వం కూడా క్యాడర్ కి దిశా నిర్దేశం చేయడానికి వార్షికోత్సవాలనే వేదికగా చేసుకుంటుంది. ఇక దేశంలో అన్ని పార్టీలు ఎపుడో ఒకపుడు వార్షికోత్సవాలు చేసుకుంటూ ఉంటాయి. ఏపీలో చూస్తే రెండు బలమైన ప్రాంతీయ పార్టీలుగా వైసీపీ టీడీపీ ఉన్నాయి. ఈ పార్టీల మీద ఇపుడు అందరి చూపు ఉంది.ఏపీలో తెలుగుదేశం పార్టీ మహానాడు అంటేనే తమ్ముళ్లకు పూనకం వస్తుంది. మూడు రోజుల పాటు జరిగే మహానాడు పసుపు పార్టీ జాతరగా కూడా చెబుతారు. చాలా ఘనంగా పార్టీ ఉత్సవాలు జరుగుతాయి. జాతీయ స్థాయి మీడియా కూడా ఇటు వైపు చూసేలా టీడీపీ పార్టీ పండుగ జరుగుతుంది. అయితే 2018 తరువాత టీడీపీలో ఆ ముచ్చట లేకుండా పోయింది. 2019 మే 23న ఎన్నికల ఫలితాలు రావడం టీడీపీ అపోజిషన్ బెంచ్ కి పరిమితం కావడంతో ఏకంగా మహానాడుకే సెలవు ఇచ్చేశారు. ఇక 2020లో మహానాడు జరుపుకోవాలనుకుంటే కరోనా వచ్చి అడ్డుపడింది. ఇక ఈసారి అయితే సెకండ్ వేవ్ గట్టిగానే ఉంది. పైగా మే నెలలో విలయమే అంటున్నాదు. దాంతో ఈసారి కూడా మొక్కుబడిగానే కథ ముగించాలని టీడీపీ భావిస్తోంది అంటున్నారు.ఇక వైసీపీ విషయానికి వస్త నాలుగేళ్ళుగా పార్టీ ప్లీనరీని అసలు నిర్వహించడం లేదు. 2017లో జూలైలో జరిగిన ప్లీనరీలోనే జగన్ పాదయాత్రకు తీర్మానం రూపొందించారు. ఆ తరువాత మళ్ళీ 2019 లో జరపాలి కానీ ఎందుకో నాడు వాయిదా వేశారు. ఇక ఇపుడు కూడా ప్లీనరీ జరుగుతుందా అన్న చర్చ అయితే సాగుతోంది. ఇప్పటికైతే ఎక్కువ టైమే ఉంది. కానీ చూడబోతే కరోనా ధాటి ఎక్కడా ఆగడంలేదు. పైగా ప్లీనరీ అంటే వేలాది మంది కార్యకర్తలు వస్తారు. ఆ మీదట జనాలతో సభను కూడా పెట్టాలని ప్లాన్ ఉంది. ఇవన్నీ కనుక చేయాలనుకుంటే కరోనా అడ్డు వస్తుంది. దాంతో వైసీపీ కూడా ఈసారికి మమ అనిపించేస్తుంది అంటున్నారు.ఇక వైసీపీ పార్టీ రాజ్యాంగం ప్రకారం మరో రెండేళ్ల వరకూ ప్లీనరీ ఊసు ఉండదు, అంటే 2023 లోనే జరపాలి అన్న మాట. అప్పటికి సార్వత్రిక ఎన్నికలు దగ్గరకు వస్తాయి. మరి ఆ టైమ్ లోనే సభ జరుపుకుంటారా అన్నదే ఇపుడు చర్చట. ఏది ఏమైనా జగన్ ముఖ్యమంత్రి హోదాలో పార్టీ అత్యున్నత వేదిక మీద మాట్లాడే అవకాశం మాత్రం ఇంతవరకూ లభించలేదు. ఇదిలా ఉంటే పార్టీకి కొత్త కార్యవర్గాలు కూడా లేవు. ప్లీనరీని తూతూ మంత్రంగా ముగించినా కొత్త కమిటీలు వేయకపోతే మాత్రం పార్టీ ఇబ్బందుల్లో పడుతుంది అంటున్నారు. చూడాలి మరి ఏం చేస్తారో.

# ఆరుజిల్లాల్లో బలం తారుమారైందా

విజయవాడ, మే 15, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో చిత్రమైన రాజకీయం కనిపిస్తోంది. ప్రధానంగా.. అధికార పార్టీ వైసీపీ, ప్రధాన ప్రతిపక్షం టీడీపీల వ్యవహారం ఆసక్తిగా మారిందని అంటున్నారు పరిశీలకులు. ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతివిమర్శలు కామనే అయినప్పటికీ.. వైసీపీ వ్యూహాత్మకంగా రాష్ట్రంలో విస్తరిస్తోంది. ముఖ్యంగా టీడీపీ కంచుకోటలుగా ఉన్న జిల్లాల్లో వైసీపీ పాగా వేస్తోంది. కానీ, వైసీపీకి కంచుకోటలుగా ఉన్న జిల్లాల్లో టీడీపీ పట్టు పెంచుకునే విషయంపై దృష్టి పెట్టడం లేదు. అంతేకాదు.. దీనిని సాధించేందుకు కూడా పార్టీ నాయకులు ఎవరూ ఆలోచన చేయడం లేదు.ఎన్నికలకు ముందు పశ్చిమ, తూర్పు గోదావరి, విజయనగరం, గుంటూరు, విశాఖ, కృష్ణా జిల్లాల్లో టీడీపీకి గట్టి పట్టుంది. తమ వ్యవస్థాపక ఓటు బ్యాంకుతో పాటు.. అభిమానులు, సానుభూతి పరులు.. ఇలా అనేక రూపాల్లో టీడీపీ ఆ జిల్లాపై పట్టు పెంచుకుని ముందుకు వెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కొన్ని కొన్ని జిల్లాల్లో క్లీన్ స్వీప్ చేయడం, మరికొన్ని జిల్లాల్లో ఫిఫ్టీ ఫిఫ్టీ ఫార్ములాలో గెలుపు గుర్రం ఎక్కడం వంటివి జరిగాయి. అయితే.. గత ఎన్నికల్లో ఆయా జిల్లాలను పూర్తిగా వైసీపీ ఆక్రమించేసింది. టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టింది.కొన్ని కొన్ని టీడీపీ పీఠాలను సైతం కదిలించేసి.. వైసీపీ పాగా వేసింది. ఇలా జిల్లాలకు జిల్లాలను అధికార పార్టీ తన హస్తగతం చేసుకుంటోంది. అంటే.. టీడీపీకి పట్టున్న జిల్లాలలో వైసీపీ ఇప్పుడు బలమైన పార్టీగా ఎదిపోతోంది. నాయకులు సైతం దూకుడుగా ఉన్నారు. ఇక, అధిష్టానం అయితే.. పైకి చెప్పకపోయినా.. టీడీపీకి పట్టున్న నియోజకవర్గాలు, జిల్లాలు, మండలాలు.. ఇలా దేనినీ వదిలి పెట్టకుండా.. తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోంది.మరి.. సహజంగానే రాజకీయాల్లో పంతాలు, పట్టుదలలు ఉంటాయి కాబట్టి.. వైసీపీకి ధీటుగా.. తమ వంతుగా టీడీపీ ప్రయత్నించి.. వైసీపీకి పట్టున్న జిల్లాల్లో టీడీపీని బలోపేతం చేస్తోందా? అంటే.. ప్రశ్నార్థకంగానే ఉందని అంటున్నారు పరిశీలకులు. నెల్లూరు, ప్రకాశం (టీడీపీకి కూడా పట్టుంది), సీమ జిల్లాలు నాలుగింటిలోనూ గత ఎన్నికల్లో వైసీపీ పూర్తిగా పట్టుసాధించింది. ముఖ్యంగా చంద్రబాబు సొంత జిల్లాను అన్ని విధాలా టార్గెట్ చేసుకుని మరీ దూకుడు చూపిస్తోంది. ఈ క్రమంలో వైసీపీకి ఇక్కడ తిరుగులేదని అంటున్నారు.ఈ పరిణామాలను గమనిస్తున్న టీడీపీ నాయకులు.. మరి వైసీపీకి ధీటుగా ఇక్కడ ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నారా? అంటే.. లేదనే చెప్పాలి. పైగా తమకు పట్టున్న జిల్లాలనే వదిలేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తుండడం గమనార్హం. ఇలా మొత్తంగా.. వైసీపీ.. తన దూకుడుతో.. టీడీపీకి పట్టున్న జిల్లాల్లో పాగా వేస్తుంటే.. కనీసం .. టీడీపీ తన ఆత్మగౌరవం కాపాడుకునేందుకు అంటే.. తనకు ఎప్పటి నుంచో కొట్టిన పిండిగా ఉన్న జిల్లాలను కూడా టీడీపీ కాపాడుకోలేక పోతోందని అంటున్నారు పరిశీలకులు.

# వైసీపీలో విస్తరణ టెన్షన్



కాకినాడ, మే 15, (న్యూస్ పల్స్) ఏపీ సీఎం జగన్ అంటే.. సెంటిమెంటుకు చాలా అతీతంగా ఉంటారనే పేరుంది. అంటే.. ఆయన ఏ సెంటిమెంటును పెద్దగా లెక్క చేయరు. ఎవరు ఏమనుకున్నా.. తాను చేయాలని అనుకున్నది చేసేస్తారు. అయితే.. ఇప్పుడు అలాంటి జగన్‌ను ఒక సెంటిమెంటు పట్టి పీడిస్తోందని.. పైగా అది పార్టీపైనా.. తనపైనా కూడా ప్రభావం చూపించే అవకాశం ఉంటుందని అనుకుంటున్నారట! నిజానికి ఇంత కరోనా సమయంలో జగన్ ఇప్పుడు సెంటిమెంటు గురించి చర్చించుకోవడం ఏంటని సందేహం వస్తుంది. కానీ, దేనిదారి దానిదే! అంటున్నారు అత్యంత విశ్వసనీయ నేతలు. వారు చెబుతున్న దానిని బట్టి.. మంత్రి వర్గ విస్తరణ విషయంలో చాలా వరకు తర్జన భర్జన పడుతున్నారు జగన్.ప్రధానంగా రెండు విషయాలను జగన్ పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. గత చంద్రబాబు పాలనను ఎంత కొట్టేస్తున్నా.. ఆయన తన పాలనలో చేసిన తప్పులు చేయకుండా.. తన పాలనను జాగ్రత్తగా నెట్టుకొస్తున్నారు జగన్. ఈ క్రమంలోనే ఆయన చంద్రబాబు 2017లో మంత్రి వర్గ విస్తరణ చేసిన తర్వాత.. చేయకముందు.. జరిగిన పరిణామాలు.. అదేవిధంగా ఉమ్మడి రాష్ట్రంలో రోశయ్య ప్రభుత్వం.. కిరణ్‌కుమార్ ప్రభుత్వాల్లో జరిగిన మంత్రి వర్గ విస్తరణలు.. వంటివి అధ్యయనం చేస్తున్నారని తెలుస్తోంది. ఆయా ముఖ్యమంత్రుల సమయంలో అనేక మంది మంత్రి వర్గంలో చోటు కోసం ఆశించారు. అయితే.. వారికి దక్కలేదు. వాస్తవానికి తొలి విడత కేబినెట్ ఏర్పాటు చేసేటప్పుడు కూడా పదవులు దక్కని వారిలో అసంతృప్తి ఉంటుంది.అయితే.. అది కొన్నాళ్లకు సమసిపోతుంది. కానీ.. ఖచ్చితంగా ఎన్నికలకు ముందు రెండేళ్లలో జరిగే మార్పులు, చేర్పుల విషయంలో కనుక అసంతృప్తి దొర్లితే.. అది పార్టీపైనా.. తన ప్రభుత్వంపై ప్రభావం పడుతుందని జగన్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. దీనికి కారణం.. గత చంద్రబాబు హయాంలోను, కిరణ్ ప్రభుత్వహయాంలో జరిగిన మంత్రి వర్గ విస్తరణేలనని అంటున్నారు. రెండు సార్లు కూడా సీనియర్లు ఆయా నేతలపై అలిగారు. తమకు అవకాశం దక్కలేదని కొందరు , జూనియర్లకు అవకాశం ఇస్తే.. మాకు ఎప్పుడు న్యాయం చేస్తారని కొందరు పార్టీకి వ్యతిరేకంగా గళం వినిపించారు.ఇది ఎన్నికల్లో ప్రభావం చూపింది. ఎన్నికలకు ముందు గ్రూపు రాజకీయాలు పేట్రేగి పార్టీ నిలువునా మునిగింది. ఇప్పుడు తనకు కూడా ఇలాంటి పరిస్థితి ఎదురైతే.. ఏం చేయాలి? అనే తర్జన భర్జనలో జగన్‌ఉన్నారు. ఈ క్రమంలో అసలు మంత్రి వర్గ విస్తరణ ఉంటుందా? లేదా? అనే టెన్షన్ ఆశిస్తున్నవారిలో గుబులు రేపుతోంది.

# విశాఖ సీటు రేసులో క్యూ

విశాఖపట్టణం, మే 15, (న్యూస్ పల్స్)ఆలూ లేదు, చూలూ లేదు అన్నట్లుగా సార్వత్రిక ఎన్నికలకు ఇంకా మూడేళ్ల వ్యవధి ఉండగానే బెర్తులు కన్ ఫర్మ్ చేసుకునే పనిలో నేతాశ్రీలు ఉన్నారు. ఇక రాజకీయ పార్టీలు కూడా అపుడే వచ్చే ఎన్నికల గురించి ఆలోచనలు చేస్తున్నాయి. ముందుగా అధికార వైసీపీ విషయానికి వచ్చే విశాఖ ఎంపీ సీటుని ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. అతి తక్కువ మెజారిటీతో గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి వైసీపీ తరఫున ఎంవీవీఎ సత్యనారాయణ గెలిచారు. ఆయనకు గెలిచిన తరువాత సొంతంగా తన పలుకుబడిని పెంచుకోలేకపోయారు అన్న విమర్శలు సొంత పార్టీ నుంచే ఉన్నాయిదాంతో వైసీపీ వచ్చే ఎన్నికలలో కాపు కార్డుని ఉపయోగించాలని చూస్తోంది. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి టీడీపీ విశాఖ జిల్లా ప్రెసిడెంట్ గా పనిచేసిన కాపు నాయకుడు పంచకర్ల రమేష్ బాబు ఏడాది క్రితం వైసీపీలో చేరారు. దాంతో ఆయన్ని వచ్చే ఎన్నికల వేళ విశాఖ నుంచి ఎంపీ బరిలో దింపాలని ఆలోచిస్తోంది అంటున్నారు. ఆయన పార్టీలో చేరిన తరువాత ఏ పదవినీ ఇంతవరకూ అప్పగించలేదు. తొందరలో పార్టీ కమిటీలు వేస్తే ఆయనకు విశాఖ అర్బన్ జిల్లా ప్రెసిడెంట్ సీటు ఇవ్వాలని కూడా ప్రతిపాదన ఉందని చెబుతున్నారు. ఇక ఆయన కాకపోతే యాదవ సామాజిక వర్గం నుంచి వంశీక్రిష్ణ శ్రీనివాస్ ని కూడా ఎంపీ సీటుకు పోటీ చేయించాలని కూడా వైసీపీ అధినాయకత్వం వ్యూహంగా ఉందిట. అలాగే వైసీపీ నుంచి వైవీ సుబ్బారెడ్డి సహా అనేక పేర్లు కూడా చర్చకు వస్తున్నాయిటీడీపీ విశాఖ ఎంపీ సీటుని బీసీకి ఇవ్వాలని ఫిక్స్ అయిందని అంటున్నారు. అర్బన్ జిల్లా ప్రెసిడెంట్ పల్లా శ్రీనివాసరావుని ఈసారి బరిలో దింపాలని చూస్తున్నారు అంటున్నారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం తరఫున ఆయన పోటీ చేసి టీడీపీని మూడవ స్థానానికి నెట్టేశారు. నాడు కాంగ్రెస్ తరఫున గెలిచిన దగ్గుబాటి పురంధేశ్వరికి అతి తక్కువ మెజారిటీ వచ్చిందంటే పల్లా దూకుడే కారణమని అంటారు. అందువల్ల ఈసారి కమ్మ సామాజికవర్గం నుంచి కాకుండా బీసీలకే విశాఖ ఎంపీ సీటు కేటాయించడం ద్వారా గరిష్ట రాజకీయ లాభాన్ని పొందాలని టీడీపీ చూస్తోందిట.ఇక పార్టీల విషయం పక్కన పెడితే విశాఖ నుంచి వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థుల్గా బరిలో ఉండాలనుకుంటున్న వారిలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ ఉన్నారు. ఆయన ఆనాటికి ఏ పార్టీ తరఫున దిగుతారో తెలియదు కానీ కచ్చితంగా విశాఖ ఎంపీగా పోటీ చేయడం ఖాయమని అంటున్నారు. ఇక మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా ఈసారి ఎంపీగానే పోటీకి తయారు అంటున్నారు. ఆయన కూడా టీడీపీ తరఫున దిగుతారా లేక వేరే పార్టీలోకి మారి పోటీ చేస్తారా అన్నది చూడాలి. ఇక గత ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసి ఓడిన దగ్గుబాటి పురంధేశ్వరి కూడా మరో మారు విశాఖ నుంచి లక్ ని పరీక్షించుకుంటారు అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో పొత్తులు ఉంటాయి కాబట్టి తాను గెలవడం ఖాయమని ఆమె భావిస్తున్నారు. ఇక మాజీ ఎంపీ హరిబాబు కూడా అవకాశం ఉంటే విశాఖ నుంచి మరో సారి ఎంపీగా పోటీకి రెడీ అంటున్నారు. అదే పార్టీలో ఉన్న కాశీ విశ్వనాధరాజు కూడా తానే బీజేపీ ఎంపీ అభ్యర్థిని అని ఇప్పటి నుంచే ప్రచారం చేసుకుంటున్నారు. మొత్తానికి చూస్తే విశాఖ ఎంపీ సీటుకు మాత్రం గట్టి పోటీ ఉంటుందని చెప్పాలి. ఎన్నికలు ఎంతో దూరంలో ఉన్నా కూడా ఎంపీలు మాత్రం అంతకంతకు పెరిగిపోతున్నారు.

# అరకు పాడేరు గిరిజన ప్రాంతాల్లోటెస్టింగ్ ల్యాబ్స్ తక్షణమే ఏర్పాటు చేయాలి

## పాచి పెంట శాంతి కుమారి డిమాండ్

విశాఖపట్నం అరుకు పాడేరు 2 నియోజవర్గంలో 11 మండలాలకు సుమారు ఏడు లక్షల మంది ఆదివాసీ ప్రజలు నివసిస్తున్న పాడేరు డివిజన్ ఐటీడీఏ పరిధిలో మహమ్మారి కరోన వ్యాపించి సుమారు రెండు సంవత్సరాలు కావస్తున్నా పరిస్థితుల్లో కరోనా దృశ్యము కనీసము సరైన ఒక కరోనా ఐసోలేషన్ కేర్ సెంటర్ను ఏర్పాటు చేయకపోవడం వల్ల 24 గంటల్లో కరోనా నిర్ధారణ పరీక్షల ఫలితాలు ప్రజలకు అంతే విధంగా ఒక్క కరోనా టెస్ట్ ల్యాబ్ ఏర్పాటు చేయకపోవడం ఆదివాసి ప్రజలకు శాపంగా మారిందని ఆదివాసీ ప్రజలు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం మూర్ఖత్వం అని ఏపీ సి సి స్టేట్ జనరల్ సెక్రటరీ అరకు పార్లమెంట్ నియోజకవర్గం డిస్టిక్స్ ఇన్చార్జి శాంతి కుమారి మండిపడ్డారు డివిజన్ పరిధిలో నేటికి అత్యధిక కరోనా రాజకీయులు నమోదవుతున్నాయి రోజురోజుకి మరణాల సంఖ్య పెరుగుతున్నాయి అమాయక ఆదివాసులు ప్రజల తమ ప్రాణాలు కోల్పోతున్నారు చాలామంది ప్రాణభయంతో తమ ఆత్మ విశ్వాసాన్ని కోల్పోయి ఎన్నిసార్లు ప్రభుత్వానికి ప్రభుత్వ అధికారులకు ప్రజాప్రతినిధులకు ఆందోళనలు విన్నపాలు పత్రికా ప్రకటనలు చేసిన ఆదివాసీ ప్రాంతాలలో కరోనా మరణాలు సంఖ్య తగ్గించడంలో ప్రభుత్వము ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు పూర్తిగా విఫలం అయ్యారని తమపై విశ్వాసనీ అతను పూర్తిగా కోల్పోయారని ఆదివాసీ ప్రజలు ప్రాణాలకు పట్టించుకునే నాథుడే తరువాయి అత్యధికులు మృత్యువాత పడుతున్నారని కరోన మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని మృతుల కుటుంబాలకు 10 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించి న్యాయం చేస్తూ ఆదివాసి కుటుంబాలకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు

# రఘురామకృష్ణంరాజు అరెస్టు కక్షపూరిత చర్య

పాలకొల్లు ఎంపీ రఘురామ కృష్ణమరాజు అరెస్ట్ ప్రభుత్వ కక్ష పూరిత చర్య. ముఖ్యమంత్రి జగన్ పై సీబీఐ కోర్టులో పిటీషన్ వేసినందుకు రఘురామ కృష్ణం రాజు అక్రమ అరెస్ట్ అని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు విమర్శించారు. కోవిడ్ పేషెంట్ లను అనుమతించని తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రా సీఐడీ పోలీసులు ఎలా అనుమతించింది. కోవిడ్ నిభందనలు పాటించకుండా ఎంపి నీ అరెస్ట్ చేయడం కోర్టు ఆదేశాలను దిక్కరణ క్రింద వస్తుంది.

# దాహం...దాహం కేకలు



గుంటూరు,మే 15, (న్యూస్ పల్స్)గుంటూరు జిల్లా, నరసరావుపేట, పట్టణ శివర్లు ప్రాంతం లో గొంతు తాడుపుకునేందుకు గుక్కెడు నీళ్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నానాటికి పెరిగి పోతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనలో మునిసిపాలిటి పని తీరు ఆశాజనకంగా లేవని విమర్శలు వినిపిస్తున్నాయి.నరసరావుపేట ఏర్పడి 200 సంవత్సరాలు పురస్కరించుకుని తెలుగుదేశం ప్రభుత్వం జన్మభూమి పథకానికి ద్విశతాబ్ది ఉత్సవాలు అనుసందానం చేసి 2వ మంచి నీటి పథకాన్ని ప్రారంభించి పూర్తీ చేసింది, ఐతే మునిసిపాలిటీ పరిధిలోనే పైపు లైన్లు ఉండటం తరవాత కాలంలో పరిధి దాటి జనవాసాలు పెరగటంతో ఆయా ప్రాంతాల ప్రజలు తాగునీటి సమస్యలు ఎదురుకొనక తప్పడం లేదు శత వసంతాలు పూర్తీ చేసుకున్న నరసరావుపేట మునిసిపాలిటీ ప్రజలకు నీరు అందించేందుకు రెండు మంచినీటి పథకాలు ఉన్నప్పటికీ శివారు ప్రాంతాలలో నివసించే బడుగు బలహీన వర్గాల వారు తాగు నీటి కోసం అల్లాడుతున్నారు. నరసరావుపేటకు నీటి కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. మున్సిపాల్టీకి సమీపంలోని శాంతి నగర్ వద్ద ఓ మంచి నీటి చెరువూ, మండల కేంద్రం ఐన నకరికలు వద్ద మరో మంచి నీటి చెరువులు ఉన్నాయి. 1915 లో ఏర్పడిన నరసరావుపేట పురపాలక సంఘం 2016 లో శాసన సభాపతి డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు ఆధ్వర్యంలో 100 సంవత్సరాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐతే , నరసరావుపేట మునిసిపాలిటీ పరిధి దాటి ఎన్నో కాలనీలు ఏర్పడ్డాయి, ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ట్యకర్ల పై ఆధారపడక తప్పడంలేదు, ట్యకర్లు రెండు రోజులకు ఒక సారి మంచినీటిని అందిస్తాయి. ఏ ఒక్క రోజైన అలెస్యంగా ట్యాంకర్లు వచ్చిన చిన్నపిల్లలతో సహా వృద్దులు ఆడవాళ్లు ఎంతో ఇబ్బందికి గురి అవుతున్నారు, కూలి పని చేసుకుని బ్రతికే మాకు మంచి నీటిని కొనుక్కునే స్తోమత వారి దగ్గర లేకపోవడంతో మంచి నీటి కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర విభజన జరిగిన జరిగిన నేపథ్యంలో మునిసిపాలిటీ పరిధిని పెంచి శివారు కాలని లను గుర్తించి నరసరావుపేట మునిసిపాలిటీ లో కలిపి తమ కాలనీలు మంచి నీరు అందేలా చేయాలనీ అక్కడి ప్రజలు కోరుకుంటున్నారు.అధికారులు ఎండాకాలం దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం 12 మిలియన్ల నీటిని సప్లై చేస్తున్నామని, నకరికలు మరియు శాంతి నగర్ చెరువులలో గాని మొత్తం 3900 మిలియన్ల లిటర్లు వాటర్ స్టోరేజ్ ఉందన్నారు.ఐతే పట్టణ ప్రజలకి కూడా మంచి నీరు సరిగా అందటం లేదని తెల్లవారుజామునే లేచి మంచి నీటి కోసం ఎదురు చేస్తుంటే అవసరాలకు సరిపడా మంచి నీరు అందటం లేదని తమకు రెండు పూటలా మంచి నీరు అందేలా చేయమని ప్రజలు అధికారులను కోరుకుంటున్నారు.

# కరోనా మృతులకు అంత్యక్రియలు

రాజోలు కరోనా విజృంభిస్తోన్న వేళ మృతుల అంత్యక్రియలకూ అగచాట్లు తప్పడం లేదు. మహమ్మారి భయంతో అయినోళ్లే దగ్గరికి రాని పరిస్థితులు.. మనిషి ఆఖరి మజిలీకి అయిన వారు కూడా రాని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా రాజోలు నియోజకవర్గంలో చింతలమోరి గ్రామ సర్పంచ్, డాక్టర్ రాపాక రమేష్ బాబు ఆధ్వర్యంలో గల పింక్ హార్ట్సు సేవాసంస్థ సభ్యులు ఒక టీం గా ఏర్పడి కరోనా తో మరణించిన మృత దేహాలకు అంత్యక్రియలు చేస్తూ మానవత్వం చాటుకుంటున్నారు. మృతుల మతాచారాలకు అనుగుణంగా అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా కరోనా బారినపడిన వారికి వైద్య సహాయం అందిస్తూ, వివిధ రకాల డ్రైఫ్రూట్స్ తో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నారు. నియోజకవర్గంలోని రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో డాక్టర్ రాపాక రమేష్ బాబు నేతృత్వంలో మట్టా పృద్వీరాజ్, రాపాక మహేష్, కుసుమ చింటు, కానూరి బాబి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పగలు, రాత్రి తేడాలేకుండా మరణించిన వారి కుటుంబీకుల అభ్యర్ధన మేరకు మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తి చేస్తున్నారు. ఇప్పటి వరకూ సుమారు 30 మృత దేహాలకు అంతిమ సంస్కారాలు చేయడం గమనార్హం. పింక్ హార్ట్సు సంస్థ సభ్యులు తమ ప్రాణాలకు తెగించి సామాజిక స్పృహతో చేస్తున్న సేవలను పలువురు అభినందిస్తున్నారు...

# గుంపర్లపాడు ఏఎన్ఎం శిరీష పై అధికారులకు ఫిర్యాదు

నెల్లూరు నెల్లూరు జిల్లా, ఏఎస్ పేట మండలం, గుంపర్లపాడు గ్రామ సచివాలయం ఏఎన్ఎం విధులు సక్రమంగా నిర్వహించకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వ్యాక్సిన్ ఉన్నా సక్రమంగా వేయడం లేదని ఆ గ్రామ సర్పంచ్ రంగారెడ్డి, గ్రామ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు . ఈ మేరకు వారు ఆర్ డి ఓ కు, ఏఎస్ పేట ఎంపీడీవో కు ,మంత్రి ఓఎస్డీ కి ఫోన్ ద్వారా సమాచారం అందించి ,ఫిర్యాదు చేశారు .విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఏఎన్ఎం పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. ప్రభుత్వం కరోనా వైరస్ నివారణకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ, వ్యాధి ప్రబలకుండా వ్యాక్సినేషన్ నిర్వహిస్తోందని రు తెలిపారు. అయితే కొందరు విధి నిర్వహణలో నిర్లక్ష్యం రు వహిస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారని తెలిపారు. గుంపర్లపాడు ఏఎన్ఎం మాత్రం వ్యాక్సినేషన్ వేయడంలో నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారని, అందువల్ల ప్రభుత్వ ఆశయం నెరవేరక కుంటుపడుతుందని ఆరోపించారు. ప్రస్తుతం వ్యాక్సిన్ దొరకక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అయితే గుంపర్లపాడు సచివాలయంలో రెండు బాటిల్స్ వ్యాక్సిన్ ఎవరికీ ఉపయోగపడకుండా, ఏఎన్ఎం కారణంగా వృథా అయిందని పేర్కొన్నారు .విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నీరుగారుస్తున్న ఏఎన్ఎం ను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# జూన్ 1 నుంచి టీచర్లు రావాల్సిందే

ఒంగోలు, మే 15, (న్యూస్ పల్స్)ఏపీల్ టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. షెడ్యూల్ ప్రకారం జూన్ 7 నుంచి టెన్త్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కరోనా కట్టడికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు.ఆరోగ్యంతో పాటు విద్యార్థులకు మంచి భవిష్యత్ అందించాలన్నదే తమ ఉద్దేశమని మంత్రి అన్నారు. ప్రస్తుతం షెడ్యూల్ ప్రకారమే టెన్త్ పరీక్షలకు విద్యార్థులు ప్రిపేర్ అవ్వాలని సూచించారు. రాబోయే రోజుల్లో కరోనా పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని మంత్రి సురేష్ తెలిపారు.ఈ నెలాఖరు వరకు విద్యార్థులకు సెలవులు ఇచ్చామన్న మంత్రి.. వారి భవిష్యత్తు కోసమే పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పలు రాష్ట్రాలు ఇప్పటికే పరీక్షలు నిర్వహించాయన్నారు. జూన్ 1 నుంచి టీచర్లు విధులకు హాజరుకావాల్సిందిగా ఆదేశించామని తెలిపారు. త్వరలో పరీక్ష షెడ్యూల్ పై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.కరోనా సెకండ్ వేవ్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లో పదోతరగతి, ఇంటర్ పరీక్షలు రద్దు చేయాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రకటన చేయడం గమనార్హం.

# బిజెపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్, మిత్రబృందం సేవలు అభినందనీయం

నెల్లూరు భారతీయ జనతా పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్ మరియు అతని మిత్రబృందం సేవలు అభినందనీయమని సింహపురి ప్రజలు వారి సేవలను కొనియాడారు. కోవిడ్ 19 కరోనా వైరస్ విస్తృతంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో దాసరి ప్రసాద్ మరియు అతని బృందం పౌష్టికాహారం, త్రాగునీరు పంపిణీ తో పాటు వలస కూలీల ను వారి వారి స్వగ్రామాలకు చేర్చేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని వారి సేవలను ప్రశంసించారు. ఇందులో భాగంగానే వైరస్ బాధిత ఉపాధ్యాయునికి వి ఆర్ కాలేజీ మిత్ర బృందం సౌజన్యంతో, బిజెపి నెల్లూరు జిల్లా లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్ తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి తమ వంతు బాధ్యతగా తనతో పాటు వి ఆర్ కళాశాలలో విద్యనభ్యసించిన మిత్రుల సహకారంతో, తమ క్లాస్మేట్ భర్త ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని వారికి 50 వేల రూపాయలు ఫోన్ పే అకౌంట్ ద్వారా పంపించడం జరిగిందని వారి సేవలు మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారిలో కొందరు మాట్లాడుతూ గతంలోనూ కరోనా వైరస్ నేపథ్యంలో వలస కూలీల కు, నిరుపేద కుటుంబాల వారికి, రోడ్ సైడ్ అనాథలకు తమ వంతు సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. ఆపత్కాల సమయాలలోనూ, విపత్కర పరిస్థితులను మనసున్న దాతలు తమ చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంతోమంది భావి భారత పౌరులను తీర్చి దిద్దేందుకు తమ వంతు కృషి చేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులందరికీ సమాజం ఎంతో రుణపడి ఉందన్నారు. నెల్లూరు జిల్లా కోట గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న విజయమోహన్ అనే వ్యక్తికి కరోనా సోకి చెన్నైలో చికిత్స పొందుతున్న క్రమంలో దాదాపు 30 లక్షలు రూపాయలు ఇప్పటికి ఖర్చు అయినట్లు తెలుస్తుంది అన్నారు. అంత మొత్తం భరించలేని ఆ కుటుంబానికి చేదోడుగా దాసరి ప్రసాద్ మిత్రబృందం సహకారం అందించడం మానవతా దృక్పథం అన్నారు.ఈ సందర్భంగా దాసరి ప్రసాద్ ఆయన మిత్ర బృందానికి అభినందనలు తెలియజేశారు.

# వైఎస్ ప్రతాప్ రెడ్డి కార్యాలయంలో పోలీసుల తనిఖీలు

అమరావతి మే 15 కడప జిల్లా మామిళ్లపల్లి గనిలో పేలుళ్ల ఘటన దర్యాప్తులో భాగంగా పోలీసులు శనివారం పులివెందులలోని వైఎస్ ప్రతాప్ రెడ్డి కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో పనిచేసే పలువురు సిబ్బందిని విచారించి పేలుడు పదార్థాల నిల్వ, విక్రయంపై వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. మామిళ్లపల్లి క్వారీలో ఈ నెల 8న జిలెటిన్ స్టిక్స్ పేలి 10 మంది మృతి చెందారు.ఘటనలో ఇప్పటికే గని లీజుదారు, జిలెటిన్ స్టిక్స్ సరఫరాదారును అరెస్టు చేశారు. ఇదే కేసులో ఈ నెల 11న ప్రతాప్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. ఈయన స్వయానా ఏపీ సీఎం జగన్‌కు బంధువు. కడప జిల్లాలోని పులివెందుల, సింహాద్రిపురం తదితర ప్రాంతాల్లో ప్రతాప్ రెడ్డి గనులను నిర్వహిస్తున్నారు. మామిళ్లపల్లి గనిలో పేలుళ్లు జరిపేందుకు ఈయన నుంచే గని లీజుదారుడు జిలెటిన్ స్టిక్స్ తీసుకెళ్లినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు.

# వెల్లుల్లి, తేనెల మిశ్రమంతో బరువు తగ్గొచ్చా.?

కరోనా సంక్షోభ సమయంలో ప్రజల ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. కరోనా రాని వారి కూడా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తీసుకునే ఆహారంలోమార్పులు చేసుకుంటున్నారు. ముఖ్యంగా తేనెను ఆహారంలో భాగం చేసుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. తేనెలో ఉండే మంచి గుణాలే దీనికి కారణం. అయితే తేనెలో వెల్లుల్లి కలిపి తీసుకుంటే బరువు తగ్గొచ్చని కొందరు నమ్ముతుంటారు. మరి ఇందులో ఎంత వరకు నిజం ఉందో ఇప్పుడు తెలుసుకుందాం..



తెనే, వెల్లుల్లి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా ఇవి జలుబు, బీపీ తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కొందరి అభిప్రాయం ప్రకారం తేనె, వెల్లుల్లి కలిపి తీసుకుంటే మెటబాలిజమ్ పెరుగుతుంది. అయితే ఇది బరువు తగ్గడంలో ఉపయోగపడుతుందన్న దానిపై ఇప్పటి వరకు ఎలాంటి నిరూపణ మాత్రం లేదు. అయితే ఈ కారణంతో తేనె, వెల్లుల్లిని తీసుకోవద్దని చెప్పలేం.. ఎందుకంటే వీటి వల్ల బరువు తగ్గకపోయినా ఇతర లాభాలు మాత్రం కచ్చితంగా ఉన్నాయి. వీటివల్ల కలిగే కొన్ని ఆరోగ్య ప్రయోజనాలపై ఓ లుక్కేయండి..× వెల్లుల్లిలో విటమిన్ బీ6, సీ, ఫైబర్, మాంగనీస్, క్యాల్షియం బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఎలుకపై జరిపిన ఓ ప్రయోగంలో వెల్లుల్లి ఇవ్వడం ద్వారా కొవ్వు తగ్గడాన్ని గుర్తించారు.× ఇక తేనె విషయానికొస్తే.. తెనే శరీరంలో గ్లూకోజ్ ఉత్పత్తికి ఉపయోగపడుతుంది. గ్లూకోజ్ మెదడులో చక్కెర శాతాన్నిపెంచడంతో పాటు కొవ్వు కరిగించే హార్మోన్లు విడుదలలో ముఖ్యపాత్ర పోషిస్తుంది.× ఇదిలా ఉంటే వెల్లుల్లిని ఎక్కువ మోతాదులో ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదు. దీని వల్ల నోటి దుర్వాసనతో పాటు కడుపులో మంటలా ఉండడం, శరీరం దుర్వాసన, గ్యాస్, వాంతులు అయ్యే అవకాశం ఉంటుంది.× గర్భిణీలు, శరీరంలో రక్తం గడ్డకట్టకుండా ఉండడానికి ముందులు ఉపయోగించే వారు తేనె, వెల్లుల్లి కలిపి తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.

# E-పాస్ లేదని క్రికెటర్‌ను అడ్డుకున్న పోలీసులు

కరోనా సెకండ్ వేవ్ నేపథ్యంలో పలు రాష్ట్రాలు ప్రయాణికుల విషయంలో కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నాయి. కొవిడ్ ఉద్ధృతి తీవ్రస్థాయిలో ఉన్న రాష్ట్రాలు ఇప్పటికే లాక్‌డౌన్ విధించాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సందర్శకులను అనుమతించేందుకు నిరాకరిస్తున్నాయి. గుజరాత్, ఢిల్లీ, గోవా, రాజస్థాన్, కేరళ తదితర రాష్ట్రాల నుంచి వచ్చే ప్రయాణికులు తప్పనిసరిగా ఆర్టీ-పీసీఆర్ పరీక్షలో నెగెటివ్ అని వచ్చిన రిపోర్ట్‌ను చూపిస్తే మహారాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోకి అనుమతిస్తున్నది. విమానాలు, రైలు, బస్సు ప్రయాణికులకైనా ఈ నిబంధన వర్తిస్తుంది.టీమ్ఇండియా ఓపెనర్ పృథ్వీ షా ఇ-పాస్ లేకుండా ప్రయాణిస్తున్నందుకు మహారాష్ట్రలోని ఓ గ్రామానికి సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. షా విహారయాత్ర కోసం గోవా వెళుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఐతే పాస్ తీసుకున్న తర్వాత అతను వెళ్లేందుకు పోలీసులు అనుమతించారు. రాష్ట్రంలోకి ప్రవేశించాలంటే ప్రయాణానికి పాస్ పొందడాన్ని తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే.కరోనా వైరస్ కారణంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) 2021 సీజన్ నిరవధికంగా వాయిదా పడటంతో పృథ్వీ తన స్వస్థలమైన ముంబైకి తిరిగి వచ్చాడు. ప్రస్తుతం క్రికెట్ నుంచి విరామం లభించడంతో ఎంజాయ్ చేయడానికి గోవాకు వెళ్తున్నట్లు అతడు వెల్లడించాడు.




# షాకింగ్ లుక్కులో దేవసేన.. పిక్ వైరల్!



తెలుగు ఇండస్ట్రీలో దశాబ్దకాలం పాటు ప్రేక్షకులను అలరించిన స్టార్ హీరోయిన్ అనుష్కశెట్టి. ఇప్పుడున్న గ్లామర్ ప్రపంచంలో అలాగే సినిమాల్లో పాత చింతకాయ పచ్చడి కథలకు వెంటనే నో చెప్పేస్తున్నారు ప్రేక్షకులు. ఈ విషయం కొన్నేళ్లుగా జరుగుతుంది. విడుదల అవుతున్నటువంటి సినిమాలు కూడా అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ మధ్యకాలంలో హీరోలు గాని హీరోయిన్లు గాని ఎవరైనా కథాకథనాలు సరిగా లేని సినిమాలు ఎంచుకుంటే మాత్రం ఫ్లాప్ తప్పనిసరిగా ఖాతాలో వేసుకోవాల్సిందే. ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్స్ నుండి అప్ కమింగ్ హీరోయిన్స్ వరకు అందరూ వైవిధ్యమైన కథల్లో నటించేందుకు ఆసక్తి చూపుతున్నారు.ఎందుకంటే అలాంటి సినిమాలు చేస్తేనే ఫ్యూచర్ ఉంటుందని త్వరగా గ్రహిస్తున్నారు. బాహుబలి సినిమా తర్వాత స్టార్ హీరోయిన్ అనుష్కశెట్టి ఆ రేంజిలో హిట్ అందుకోలేకపోయింది. ప్రస్తుతం అమ్మడికి హిట్టు కంపల్సరీ అయిపోయింది. మొన్నటివరకు అంటే 2017 నుండి అనుష్క నుండి కేవలం రెండు సినిమాలే వచ్చాయి. అవి రెండు కూడా ప్రయోగాలుగానే మిగిలిపోయాయి. 2018లో భాగమతి 2020లో నిశ్శబ్దం రెండూ కూడా బాక్సాఫీస్ ఫ్లాప్ లుగా నిలిచాయి. అయితే మళ్లీ వరుసగా గ్యాప్ లేకుండా సినిమాలు చేయడానికి రెడీ అవుతోందని టాక్.కానీ తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అనుష్క లుక్ చూస్తే మాత్రం ఎవరు కూడా ఆమె అనుష్కే అనే నమ్మేలా లేదు. ఎందుకంటే ఈ మధ్యన అటు సోషల్ మీడియాలో ఎందులో కనిపించకపోయే సరికి ఫ్యాన్స్ అందరూ తదుపరి సినిమా కోసం నాజూకుగా తయారు అవుతుందేమో అనుకున్నారు. కానీ షాకింగ్ న్యూస్ ఏంటంటే.. ఇదివరకటి కంటే మరింత లావుగా మారింది అనుష్క. ముఖ్యంగా మొహం చూసే చెప్పేయొచ్చు. చూడటానికి ముద్దుగా బొద్దుగానే ఉంది కానీ ఇదివరకటి కళ కనిపించడం లేదు. మరి ఏం చేస్తుందో ఫ్యాన్స్ కు మాత్రం అర్థం కావడం లేదు. ఫేస్ లో కూడా గ్లో లేదు. మరి సినిమాకోసమేనా లేకపోతే మాములుగానే ఇలా అయ్యిందా అనేది తెలియాల్సి ఉంది. అనుష్క ప్రస్తుతం మహేష్ అనే దర్శకుడితో సినిమా ఓకే చేసింది.

# సినిమా బండి గురించి రాజ్ - డీకే చెప్పిన విశేషాలు..!



తెలుగులో cడీ ఫర్ దోపిడీc అనే చిత్రాన్ని నిర్మించిన దర్శకద్వయం రాజ్ నిడిమోరు కృష్ణ డీకే.. ఇప్పుడు బాలీవుడ్ లో సత్తా చాటుతున్నారు. ఇక cది ఫ్యామిలీ మ్యాన్c వెబ్ సిరీస్ తో దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం బాలీవుడ్ స్టార్ హీరో షాహీద్ కపూర్ తో ఓ వెబ్ సిరీస్ రూపొందిస్తున్నారు రాజ్ డీకే. అయితే యంగ్ టాలెంట్ ని ఎంకరేజ్ చేయడానికి డి2ఆర్ ఇండీ అనే ప్రొడక్షన్ హౌస్ ఏర్పాటు చేశారు. ఈ బ్యానర్ లో రూపొందిన ఫస్ట్ మూవీ ccసినిమా బండిcc మే 14 నుండి నెట్ ఫ్లిక్స్ లో విడుదల కానుంది. ప్రవీణ్ కందిరేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి వసంత్ మరింగంటి రచన చేశారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ - cబావిలోన కప్పc సాంగ్ విశేష స్పందన తెచ్చుకుని ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో రాజ్ డీకే తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు.ccసినిమా బండి ఒక సింపుల్ స్టోరీ. కానీ దర్శకుడు ప్రవీణ్ మియు రచయిత వసంత్ ఒక ఫ్లిప్ బుక్ లో బొమ్మలతో మొత్తం కథను రెడీ చేసుకొచ్చారు. వాళ్లకి ఉన్న ప్యాషన్ వాళ్ళు చేసిన హోమ్ వర్క్ మాకు నచ్చింది. దీంతో 10 నిమిషాల షార్ట్ ఫిల్మ్ తో రమ్మని చెప్పాం దానికి వాళ్ళు 40 నిమిషాల షార్ట్ ఫిల్మ్ తో వచ్చారు. మాకు చెప్పిన దాంట్లో 80 చేయగలిగారు. స్క్రిప్ట్ ఇంకాస్త మెరుగు పరచడానికి మేము హెల్ప్ చేశాం. నేచురల్ అండ్ రా గా ఉండాలని కోరుకున్నాం. ఇది నిజాయితీ మరియు మంచి భావోద్వేగాలతో నిండి ఉంటుంది. ప్రేక్షకులకు అది కచ్చితంగా నచ్చుతుందిcc అని రాజ్ డీకే చెప్పారు.తెలుగు ప్రేక్షకులు ఈ సినిమాను థియేటర్లలో రిలీజ్ చేసినా ఖచ్చితంగా అంగీకరించేవారని అనుకుంటున్నామని.. థియేటర్స్ లో విడుదల చేసే అవకాశం ఉంటే చేసేవాళ్ళమని దర్శకద్వయం తెలిపారు. cఫ్యామిలీ మ్యాన్ 2c లో సమంత అక్కినేని నటించడం గురించి మాట్లాడుతూ.. ccమేము ఎగ్జైటింగ్ గా ఉన్నాం. మేము ప్రామిస్ చేసినట్లే ఈ వేసవిలోనే ప్రేక్షకుల ముందుకు వస్తుంది. cసూపర్ డీలక్స్c లో సమంత బోల్డ్ క్యారెక్టర్ ప్లే చేసింది. అది చూసి మేము ఆమెనే అనుకున్నాము. సామ్ కూడా ఉత్సాహంగా చేయడానికి ఒప్పుకుంది. ఆమె మిమ్మల్ని సర్ప్రైజ్ చేస్తుందిcc అని రాజ్ - డీకే చెప్పుకొచ్చారు.ఇంకా రాజ్ డీకే మాట్లాడుతూ.. ccహైదరాబాద్ లోనే మా జర్నీ స్టార్ట్ అయింది. తెలుగులో ఎప్పుడో సినిమా చేయాల్సింది. కానీ వర్కౌట్ అవలేదు. మా దగ్గర రెండు స్క్రిప్ట్ లు రెడీగా ఉన్నాయి. త్వరలో తెలుగులో సినిమా మేము ఎదురు చూస్తున్నాము. ప్రస్తుతం షాహిద్ కపూర్ తో ఓ వెబ్ సిరీస్ చేస్తున్నాం. అలానే హాలీవుడ్ రూస్సో బ్రదర్స్ నిర్మించే మరో పెద్ద వెంచర్ చేయాల్సి ఉంది. ఆ ప్రాజెక్టుతో వాళ్ళు భారతీయ ఓటీటీ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారుcc అని వెల్లడించారు.

# రాజశేఖర్ - గోపీచంద్ కాంబోలో మల్టీస్టారర్.. దర్శకుడు ఎవరంటే..?



టాలీవుడ్ లో ఈ మధ్య మల్టీస్టారర్ సినిమాల సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ఈగోలు - స్క్రీన్ స్పేస్ వంటి అంశాలని పక్కనపెట్టి ఇద్దరు స్టార్స్ ఒకే సినిమాలో కనిపించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం cఆర్.ఆర్.ఆర్c సినిమాలో ఎన్టీఆర్ - రామ్ చరణ్ కలిసి నటిస్తున్నారు. అలానే cఅయ్యప్పనుమ్ కోశీయుమ్c తెలుగు రీమేక్ లో పవన్ కళ్యాణ్ - రానా దగ్గుబాటి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. వీటితో పాటుగా పలు క్రేజీ మల్టీస్టారర్ సినిమాలు సెట్స్ పై ఉండగా.. cడ్రైవింగ్ లైసెన్స్c రీమేక్ వంటి మరికొన్ని చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా మరో క్రేజీ మల్టీస్టారర్ కి రంగం సిద్ధమవుతోందని వార్తలు వస్తున్నాయి.సీనియర్ హీరో యాంగ్రీస్టార్ డా.రాజశేఖర్ - యాక్షన్ హీరో గోపీచంద్ కాంబినేషన్ లో ఓ మల్టీస్టారర్ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. cలక్ష్యంc cలౌక్యంc cడిక్టేటర్c వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ శ్రీవాస్.. ఈ క్రేజీ మల్టీస్టారర్ మూవీని తెరకెక్కించనున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త ఒకరు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారని సమాచారం. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా మొదలయ్యాయి. కోవిడ్ పరిస్థితులు చక్కబడిన తర్వాత అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.ఇకపోతే గోపీచంద్ - శ్రీవాస్ కాంబినేషన్లో ఇంతకుముందు వచ్చిన cలక్ష్యంc cలౌక్యంc సినిమాలు ఘన విజయం సాధించాయి. ఇప్పుడు రాజశేఖర్ తో కలిసి వస్తున్న ఈ సక్సెస్ ఫుల్ కాంబో హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంటుందేమో చూడాలి. ప్రస్తుతం గోపీచంద్ cసీటీమార్c సినిమా చేస్తుండగా.. రాజశేఖర్ cశేఖర్c c=ూ92c cమర్మాణువుc అనే మూడు క్రేజీ ప్రాజెక్ట్స్ ని లైన్ లో పెట్టారు.

## అందాల ఫరియా జోరు అందుకే పెరగడం లేదా?

ఇటీవల కాలంలో తెలుగు తెరకి పరిచయమైన అందమైన కథానాయికలలో ఫరియా అబ్దుల్లా ఒకరుగా కనిపిస్తుంది. cజాతిరత్నాలుc సినిమాలో తళుక్కున మెరిసిన ఈ సుందరిని చూసి కుర్రాళ్లు కర్చీఫులు పారేసుకున్నంత తేలికగా పడుచు మనసులను పారేసుకున్నారు. ఫరియా మంచి పొడగరి .. అందుకు తగిన పర్సనాలిటీతో ఆకర్షణీయంగా ఉంటుంది. చక్కని పలువరుసతో .. చిక్కనైన పెదాలతో .. ఆకాశాన్ని దాచేసే విశాలమైన కళ్లతో .. విల్లు వంచినట్టుగా ఉండే దట్టమైన కనుబొమలను తోడుగా చేసుకున్న ఈ అమ్మాయి నవ్వు మరింత అందంగా ఉంటుంది.వినోదం పరంగా cజాతిరత్నాలుc సినిమా గురించి మాట్లాడుకున్న వాళ్లంతా ఈ అమ్మాయి గ్లామర్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకున్నారు. నిండు చందమామలా ఉన్న ఈ అమ్మాయికి అభిమానులుగా మారిపోయారు. తెలుగు తెరను ఈ బ్యూటీ ఏలేయడం ఖాయమని అనుకున్నారు. ఆల్రెడీ ఆమెకు కొన్ని అవకాశాలు వచ్చాయని కూడా చెప్పుకున్నారు. కానీ ఆశించిన స్థాయిలో ఆమెకు అవకాశాలు దక్కడం లేదనే చెప్పాలి. అందుకు కారణం ఆమె అందమో .. నటనో కాదు .. ఆమె హైటూ అనే మాటనే వినిపిస్తోంది.హీరోయిన్లు అందంగా ఉండి .. హైటూ తక్కువగా ఉంటే కెమెరా ముందు ఆ విషయం తెలియకుండా ఎలాగోలా మేనేజ్ చేస్తారు. కానీ హీరోయిన్ హైటు ఎక్కువ ఉంటే మాత్రం చేసేదేం ఉండదు. అలాంటప్పుడు ఆ హీరోయిన్లు మంచి హైటున్న హీరోల సినిమాల్లోనే అవకాశాలను చేజిక్కించుకోవలసి ఉంటుంది. ప్రభాస్ .. మహేశ్ బాబు .. గోపీచంద్ .. నాగశౌర్య ... ఇలా హైటున్న హీరోల జోడీగా ఫరియా నప్పుతుంది. తన హైటూ అవకాశాలకు అడ్డుపడుతోందని అంటున్నారు.






EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190